




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 329, పేజీలు - 08








మంగళవారం, మే 19, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD


## భగీరథ్ కేసులో
# రాజకీయం వర్సెస్ చట్టం

### - మైలేజ్ కోసం బీఆర్ఎస్ ప్రయత్నం - కాంగ్రెస్, బీజేపీ తిప్పికొట్టగలవా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ కేసు కేవలం చట్టపరమైన పరిధిని దాటిపోయి రాజకీయంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ ను ఒకే గాటన కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరోవైపు అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఒక హై-వోల్టేజ్ మైండ్ గేమ్ కు వేదికైంది.

**బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్**

తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బండి భగీరథ్ కేసు చుట్టూ తిరుగుతున్నాయి. బీజేపీ దశ మారుస్తారని భావిస్తున్న కీలక నేత కుమారుడు కావడం, భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం, ఆయన లొంగిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచాయి. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్ ఒక బలమైన రాజకీయ ఆయుధంగా మలచుకుంటుండగా, బీజేపీ దీనిని హనీ ట్రాప్‌గా అభివర్ణిస్తూ ఎదురుదాడికి దిగుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉంటే కేసును ప్రభావితం చేస్తారని అంటున్నారు.

**కాంగ్రెస్ వ్యూహం- చట్టం అందరికీ సమానమే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేసు నమోదైన నాటి నుంచే దర్యాప్తులో ఎందుకు జాప్యం జరుగుతోందని డీజీపీని ప్రశ్నించడం ద్వారా, తన ప్రభుత్వం చట్టం అమలులో ఎవరికీ మినహాయింపు ఇవ్వదని గట్టి సందేశం పంపారు. కేంద్ర మంత్రి కుమారుడైనా సరే వదిలేది లేదని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మహిళల భద్రత, పోక్సో కేసుల తీవ్రతను ప్రస్తావిస్తూ బీజేపీని ఆత్మరక్షణలో పడేసేలా కాంగ్రెస్ తన సోషల్ మీడియా విభాగాన్ని రంగంలోకి దింపింది.

**బీజేపీ కౌంటర్ - కుట్ర సిద్ధాంతం**

మరోవైపు బీజేపీ ఈ కేసును నేరుగా బండి సంజయ్ రాజకీయ ప్రతిష్టపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తోంది. ప్రధాని మోదీ సభ , హిందూ ఏక్తా యాత్రల సమయంలోనే ఈ కేసును వెలుగులోకి తేవడం వెనుక లోతైన కుట్ర ఉందని బండి సంజయ్ ఆరోపిస్తున్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నా కుమారుడిని టార్గెట్ చేశారు

2లో..

## కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణం

### - మంత్రులుగా ప్రమాణం చేసిన 20 మంది ఎమ్మెల్యేలు
### - ప్రమాణ స్వీకార వేడుకకు హాజరైన పినరయి విజయన్



తిరువనంతపురం (ప్రశ్న న్యూస్) కేరళం సీఎంగా కాంగ్రెస్ నేత వి.డి. సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సతీశన్‌తో పాటు యూడీఎఫ్ కూటమికి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో 14 మంది కొత్తవారు ఉండటం గమనార్హం. కేరళ కేబినెట్

2లో..

## తెలంగాణలో పసుపు ఇక టీడీపీకి కాదు
# టీఆర్ఎస్‌ది

### ఊరూ వాడా పసుపు జెండాలు ఆవిష్కరించనున్న కవిత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ వేదికగా తెలంగాణ రక్షణ సేన పార్టీ తన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక అడుగు వేసింది. పార్టీ అస్తిత్వానికి ప్రతీకగా భావించే అధికారిక జెండా గద్దె నమూనాను ఆ పార్టీ అధినేత్రి కవిత ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఒకే విధమైన బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించిన ఈ సరికొత్త డిజైన్ అత్యధికంగా పసుపు రంగులో ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.




**అత్యధికం పసుపు రంగంలో జెండా డిజైన్**

తెలంగాణ గడ్డపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించే దిశగా తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. పార్టీ కోర్ కలర్‌గా పసుపు రంగును ఎంచుకున్న ఈ పార్టీ, తాజాగా తన అధికారిక జెండా గద్దె నమూనాను విడుదల చేసింది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, పోరాట పటిమను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ గద్దెలు, రానున్న రోజుల్లో

2లో..

## 40 వేల మందితో చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్

### - సీఎంతో మాట్లాడడంపై ఉద్యోగుల హర్షం



అమరావతి (ప్రశ్న న్యూస్) సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఒకే బృందంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం అమరావతిలోని

2లో..

# రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్

### - రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ - తిరుపతి జిల్లాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ల తయారీ ప్లాంట్
### - 18 నెలల్లో ప్రాజెక్టు ప్రారంభమయ్యేలా చూడాలన్న సీఎం

అమరావతి (ప్రశ్న న్యూస్) రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్ రానుంది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని వానేలూరు, రాళ్లకుప్పం ప్రాంతంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ మోటార్ సైకిల్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటు కానున్న సంగతి తెలిసిందే. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపింది. దీంతో రెండేళ్లలోగా ఈ ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. అయితే 24 నెలలు కాదు 18 నెలల్లోనే అందుబాటులోకి తేవాలంటున్నారు సీఎం చంద్రబాబు నాయుడు. రాయల్ ఎన్?ఫీల్డ్ ఎండీ, సీఈవో గోవిందరాజన్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో సీఎం చంద్రబాబు సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు



అంశాలపై చర్చించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. "ఆంధ్రప్రదేశ్‌లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్‌కి సుస్వాగతం మా ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా ఏపీలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రయాణం సాఫీగా సాగిపోతుంది.

2లో..

# కేబీఆర్ పార్క్ చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే

### - కొత్త ఫ్లైఓవర్ పనులకు బ్రేక్

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని ప్రముఖ కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) జాతీయ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ఉన్న చెట్లను నరకవద్దని ఆదేశిస్తూ న్యాయస్థానం స్టే విధించింది. ముఖ్యంగా కేబీఆర్ పార్క్ సమీపంలో 35 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ టచ్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం

2లో..



## రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదు

### - బీఆర్ఎస్ పార్టీకి నైతిక విలువలు ఎక్కడివి?
### - బీఆర్ఎస్ పార్టీకి రాజకీయం చేతకాకపోతే తప్పుకోండి.



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరతపై రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) కీలక ప్రకటన చేశాయి. రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని తెలంగాణ రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు వెల్లడించాయి. సరఫరాను ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర

2లో..

## తెలంగాణలో ఇందిరమ్మ
# కుటుంబ జీవిత బీమా పథకం

### - ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటికే పలు కీలక పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోంది. తాజాగా మరో పథకాన్ని ప్రారంభించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ప్రతి కుటుంబానికి రూ.5లక్షల జీవిత బీమా ప్రయోజనం కల్పించేలా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. దీనిపై త్వరలోనే విధివిధానాలు ప్రకటించనుంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం రేపు దీనిపై భేటీ కానుంది. పథకానికి సంబంధించిన నిబంధనలను ఇతర అంశాలను ఖరారు చేయనుంది. 2026 జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ కొత్త పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. ఇక ఈ పథకం కింద రాష్ట్రంలోని దాదాపు 1.15 కోట్ల

2లో..

## బండి భగీరథ్ పోక్సో కేసులో
# కీలక మలుపు

### - జీవితఖైదు పడే సెక్షన్ నమోదు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**సంచలనం సృష్టించిన పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై దర్యాప్తు అధికారులు కేసును మరింత తీవ్రతరం చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 64(2)(ఎం) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే నిందితుడికి పదేళ్లకు పైగా జైలు శిక్ష, కొన్ని సందర్భాల్లో జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉంది. ఈ నెల 8న బాధితురాలైన



2లో..

## బండి కుటుంబంపై
# కుట్ర వెనక బీఆర్ఎస్

### - బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మద్దతు

- బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదన్న రామచందర్ రావు
- బండి సంజయ్, బీజేపీపై రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శ
- వ్యక్తిని, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం సరికాదన్న రామచందర్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తక్షణమే రాజీనామా

2లో..

# పంచాయతీరాజ్ శాఖలో గ్రీన్ షాప్ విధానం

### - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 'స్థానిక సంస్థలు చేసే అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా ప్రజలకు తెలియాలి. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పబ్లిక్ డాష్ బోర్డును తయారు చేయండి. దీనిలో రాష్ట్రంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణం, సంబంధిత అభివృద్ధి పనులు, అలాగే రోడ్ల పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు ప్రతి ఒక్కరికి కల్పించాలి' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ విధానంతో పారదర్శకంగా పన్నులు వసూళ్లు చేసిందని చెప్పారు. పంచాయతీలు ఆదాయ వనరులు మరింత పెంచుకొని ముందుకు సాగాలని, ఇదే రీతిలో సమష్టి కృషిని కొనసాగించి వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఆ స్ఫూర్తిని కొనసాగించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. పంచాయతీరాజ్ శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పంచాయతీరాజ్ శాఖ

2లో..



# భగీరథ్ కేసులో రాజకీయం వర్సెస్ చట్టం

అనేది బీజేపీ ప్రధాన వాదన. అంతేకాకుండా, బాధితురాలు మైనర్ కాదని, ఆమెకు రెండు వేర్వేరు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు ఉన్నాయనే వార్తలను బీజేపీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ వచ్చింది. అయితే బీజేపీకి ఏదీ కలసి రాలేదు. బాధితురాలు మైనర్‌గా తేలడంతో జైలుకు వెళ్లక తప్పలేదు.

### క్షేత్రస్థాయిలో కేడర్‌పై ప్రభావం

ఈ గొడవ వల్ల క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం భగీరథ్ వ్యక్తిగత విషయం కాదని, పార్టీ గౌరవానికి సంబంధించిన అంశంగా వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం తన న్యాయ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దీనిని ఒక ఉదాహరణగా చూపిస్తోంది. ఈ రెండు పార్టీలను ప్రజల్లో దోషులుగా నిరూపించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసు దర్యాప్తు వేగం పుంజుకునే కొద్దీ తెలంగాణ రాజకీయం మరిన్ని మలుపులు తిరగడం ఖాయం.

# కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణం

మొత్తం ఒకే రోజు ప్రమాణం చేయడం సుమారు గత 6 దశాబ్దాల్లో ఇదే తొలిసారి కావడం విశేషం.కేరళం సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ మాత్రం ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.మరో ముఖ్యమైన విషయం ఏంటంటే గత పదేళ్లపాటు కేరళం సీఎంగా పని చేసిన పినరయి విజయన్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ సైతం సతీశన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. గత రెండు ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ కూటమిని అధికారంలోకి తెచ్చిన విజయన్ ఈసారి ప్రతిపక్షానికే పరిమితం అయినప్పటికీ ఎలాంటి భేషజాలకు పోకుండా తన స్థానంలో సీఎం పీఠాన్ని అధిష్టిచబోతున్న నాయకుడి ప్రమాణ స్వీకారానికి రావడం చెప్పుకోదగ్గ విషయం అని చెప్పొచ్చు.2024లో ఒడిశా సీఎంగా బీజేపీ నేత మోహన్ చరణ్ మాఝీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేడీ నేత, వరుసగా ఐదుసార్లు ఒడిశా సీఎంగా పని చేసిన నవీన్ పట్నాయక్ హాజరయ్యారు. జనం తనను తిరస్కరించారనే బాధ కంటే.. ప్రజా తీర్పును గౌరవించాలనే భావనే ఆయన ముఖంలో కనిపించింది. ఈ వీడియో అప్పట్లో వైరల్ అయ్యింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి మనకు కనిపించడం లేదు. ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు 2014, 2024లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార వేడుకలకు జగన్ వెళ్లలేదు. 2019లో జగన్ సీఎంగా ప్రమాణం చేయగా చంద్రబాబు వెళ్లలేదు. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేసీఆర్ హాజరు కాలేదు. అంతే కాదు ఓటమి తర్వాత ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడటానికి ప్రెస్ మీట్ కూడా పెట్టలేదు. కానీ మన పొరుగున ఉన్న ఒడిశా, కేరళంలో మాత్రం నాయకులు ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రజా తీర్పును గౌరవిస్తూనే తమ గౌరవాన్ని కూడా పెంచుకునేలా వ్యవహరిస్తున్నారు.ఇక కేరళం కేబినెట్ విషయానికి వస్తే 21 మంది మంత్రుల్లో 14 కొత్త ముఖాలే. కాంగ్రెస్ ప్రధాన భాగస్వామి అయిన ఐయూఎంఎల్‌కు ఐదు మంత్రి పదవులు దక్కాయి. తమిళనాడులోనూ ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్‌కు కేరళంలోని మలబార్ ప్రాంతంలో మంచి పట్టు ఉంది. చట్ట సభల్లో ప్రాతినిధ్యం పరంగా చూస్తే ఇప్పుడు మజ్లిస్ కంటే ఐయూఎంఎల్‌నే దేశంలో పెద్ద ముస్లిం పార్టీ అని చెప్పొచ్చు. సీఎం పదవితోపాటు ఆర్థిక శాఖను కూడా సతీశన్ పర్యవేక్షిస్తారని తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత రమేశ్ చెన్నితల హోం శాఖ బాధ్యతలను తీసుకునే అవకాశం ఉండగా కేరళం పీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవిన్యూ శాఖ దక్కొచ్చని సమాచారం.

### కేరళం మంత్రులు

సతీశన్ (సీఎం), రమేశ్ చెన్నితల, సన్నీ జోసెఫ్, మోన్స్ జోసెఫ్, శిబు బేబీ జాన్, అనూప్ జాకబ్, సీపీ జాన్, ఏపీ అనిల్ కుమార్, టి. సిద్ధిఖ్, పీసీ విష్ణునాథ్, రోజీ ఎం జాన్, బిందు కృష్ణ, ఎం లిజ్జు, కేఏ తులసి, ఓజే జనీశ్, పీకే కున్హాలి కుట్టి, కేఎం షాజీ, పీకే బషీర్, ఎన్. శ్యామ్ సుధీన్. తిరువంచూర్ ఎమ్మెల్యే రాధాకృష్ణన్‌ను స్పీకర్‌గా, షానిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా, అపు జాన్ జోసెఫ్‌ను ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమించారు. ఈ పేర్లను గమనిస్తే మన దగ్గర పదవుల పంపకాల్లో సామాజిక సమీకరణాలను చూసుకుంటే కేరళంలో మతాల బ్యాలెన్సింగ్ ఉందనే విషయం అర్థ.

# రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈవీ మోటార్ సైకిల్‌కు కావాల్సిన గ్రీన్ ఎనర్జీ ఎకోసిస్టమ్, నైపుణ్యం కలిగిన యువత ఏపీలో సిద్ధంగా ఉన్నారు" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. తిరుపతిలో ఏర్పాటు చేసే రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ ప్లాంట్ గురించి ప్రతినిధి బృందంతో చర్చించామన్న చంద్రబాబు.. రూ.2500 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్లాంట్ ద్వారా ఏటా 9 లక్షల రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టులో భాగంగా అధునాతన తయారీ ప్లాంట్, టెస్టింగ్ ట్రాక్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, వెండార్ పార్క్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 15 వేల మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చంద్రబాబు వెల్లడించారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని.. పారిశ్రామిక వృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు కావాల్సిన అనుమతులు, మద్దతును ప్రభుత్వం నుంచి వేగంగా అందేలా తాము చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా అనుకున్న విధంగా 24 నెలల్లో కాకుండా 18 నెలల్లోనే ప్రాజెక్టు ప్రారంభించాలనేదే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల ద్వారా ప్రాజెక్టు వేగంగా సాగుతుందన్న చంద్రబాబు రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ కూడా ప్రాజెక్టు అమల్లో ఇదే రీతిలో చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ భేటీ సందర్భంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ మొదటి ఎలక్ట్రిక్ బైక్ ఫ్లైయింగ్ ఫ్లీ సి6 (ఎఫ్ఎఫ్.సి6) గురించి తెలుసుకోవటం అద్భుతంగా ఉందన్నారు చంద్రబాబు. ఈ భేటీ సందర్భంగా సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో ఏపీ పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించినట్లు చంద్రబాబు ట్వీట్ చేశారు.

# రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదు

కోఆర్డినేటర్ తెలిపారు. రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు చమురురంగ కంపెనీలు తెలిపాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహ అవసరాల ఎల్పీజీ సిలిండర్ల బుకింగులు తగ్గుముఖం పట్టినట్లు వెల్లడించాయి. వినియోగదారులు ఆందోళనతో ముందస్తు బుకింగ్స్ చేసుకోవద్దని కోరాయి. ఈ నెలలో 17వ తేదీ వరకు మొత్తం 20.06 లక్షల ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేసినట్లు వెల్లడించాయి. ఈ సీజన్‌కు ఇది సాధారణమేనని, ఎస్సెమ్మెస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. సిలిండర్ల సరఫరాలో అక్రమాలను అరికట్టడానికి, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ అథెంటికేషన్ కోడ్ వ్యవస్థను అనుసరించాలని సూచిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో ఈ విధానం 95 శాతం అమలవుతున్నట్లు తెలిపాయి.

## తెలంగాణలో ఇందిరమ్మ

# కుటుంబ జీవిత బీమా పథకం

కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నట్లు స్పష్టం అవుతోంది. పేద, ధనిక అనే తేడాలు లేకుండా రాష్ట్ర ప్రజలందరికీ ఈ బీమాను వర్తింపజేస్తామని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలో అయితే తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి అలాగే అసంఘటిత రంగంలోని కార్మికులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ పథకం కింద ప్రభుత్వమే బీమా ప్రీమియాన్ని చెల్లిస్తోంది. అయితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రజల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఇక ఇదే పథకంపై గతంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్నారు. దాంతో ఇప్పుడు 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.

## పంచాయతీరాజ్ శాఖలో

# గ్రీన్ షాప్ విధానం

ప్రగతిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చర్చించారు.

### శాలిడ్ వేస్ట్‌మేనేజ్మెంట్ విధానంతో సత్ఫలితాలు

'శాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటులో భాగంగా తీసుకొచ్చిన స్వచ్ఛరథాల విధానం మంచి ఫలితాలను ఇస్తోంది. స్వచ్ఛందంగా ప్రజలు రథాల వద్దకు వచ్చి పొడి వ్యర్థాలను ఇచ్చి, నిత్యావసరాలను తీసుకెళ్లడం బాగుంది. దీన్ని ప్రతి నియోజకవర్గంలోనూ అమలు చేస్తున్నాం. ఈ విధానాన్ని మరింత విస్తరించేలా ఆలోచన చేయండి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ ఆదేశించారు. 'దీంతోపాటు గ్రీన్ షాప్ పేరుతో తిరుపతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చిన విధానాన్ని మరింత విస్తరించి, రాష్ట్రమంతటా అమలు చేయాలి. స్వచ్ఛరథాల ద్వారా ఏప్రిల్ నెలలో 18.86 లక్షల కేజీల చెత్తను సేకరించాం. ఆ వ్యర్థాల విలువ రూ. 3 కోట్ల వరకు ఉంటుంది. గ్రీన్ షాపులను ఇదే స్ఫూర్తితో ప్రజలకు దగ్గర చేయాలి. పొడి వ్యర్థాలను గ్రీన్ షాపుల్లో ఇస్తే, ప్రజలు నిత్యావసరాలను తీసుకెళ్లొచ్చని విస్తృత ప్రచారం కల్పించండి. తద్వారా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన పెంచండి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

### రోడ్లు పూర్తి చేయడానికి నిర్దుష్ట సమయం

'పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులు నిర్దుష్ట సమయంలో నాణ్యతతో పూర్తయ్యేలా చూడండి. రోడ్ల నిర్మాణం, పనుల పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేకమైన డ్యాష్ బోర్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురండి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. 'రోడ్ల నిర్మాణ పనులను అధికారులు బాధ్యతగా తీసుకోవాలి. ప్రతి పని మొదలుపెట్టే ముందు కచ్చితంగా ఎప్పటిలోగా పూర్తి చేస్తామనేది సమయం పెట్టుకోండి. ప్రజల వినతుల ద్వారా వచ్చే ప్రతి రోడ్డు పని చక్కగా జరగాలి. ప్రజలకు శాఖ తరఫు నుంచి పూర్తి జవాబుదారీ తనం కనిపించాలి. రోడ్ల విషయంలో నాణ్యతకు పెద్దపీట వేయాలి. నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలనలు ఉంటేనే రోడ్ల పరిస్థితి అర్థం అవుతుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ బాలునాయక్ పాల్గొన్నారు.

# బండి కుటుంబంపై కుట్ర వెనక బీఆర్ఎస్

చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అదే సమయంలో కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. అదే సమయంలో బీజేపీపైనా బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఇవన్ని విమర్శలకు తాజాగా బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కౌంటర్ ఇచ్చారు. బండి భగీరథ్ కేసులో బండి సంజయ్ తప్పేమీ లేదని స్పష్టం చేశారు.కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీపై తీవ్ర అసత్య ప్రచారం జరుగుతోందని రాంచందర్‌రావు మండిపడ్డారు. ఒక వ్యక్తిని, అతడి కుటుంబాన్ని టార్గెట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీపై, బండి సంజయ్ బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని విరుచుకుపడ్డారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రం మొత్తం పోస్టర్లు వేయించారని ఆరోపించారు. బండి సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని ఆయనపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోదని తేల్చి చెప్పారు. ఇక బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఏదైనా తప్పు చేస్తే న్యాయపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బండి సంజయ్‌పై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు.ఇక గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మహిళలపై నేరాల శాతం 67 శాతం పెరిగిందని గుర్తు చేసిన రాంచందర్ రావు జూబ్లీహిల్స్ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన కేసులో కేసీఆర్ గానీ, కేటీఆర్ గానీ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్తే రాజీనామా చేశారా అని నిలదీశారు. ఇక తనను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళా సర్పంచి ఫిర్యాదు చేస్తే ఆ పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు.కేటీఆర్‌కు నైతిక విలువలు లేవని వారి ఇంట్లో ఆడబిడ్డ తప్పు చేస్తే ఎందుకు రాజీనామా చేయలేదని ఈ సందర్భంగా రాంచందర్ రావు నిలదీశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం రాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ఫార్ములా ఈ–కార్ రేస్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసిపోయాయి కాబట్టే కేటీఆర్, కేసీఆర్‌లను అరెస్ట్ చేయడం లేదని విమర్శించారు.ఈ క్రమంలోనే కేంద్రమంత్రి బండి సంజయ్, ఆయన కుటుంబంపై వస్తున్న ఆరోపణల వెనుక బీఆర్ఎస్ పార్టీ కుట్ర ఉందని మండిపడ్డారు. బండి సంజయ్, ఆయన కుమారుడికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ పార్టీకి వేరే పని లేనట్టు ఉందని ఆరోపించారు. బండి సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని ఒకవేళ తప్పు చేస్తే కచ్చితంగా పార్టీ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# నిబంధనలను తుంగలో తొక్కి మెరిట్‌కు అన్యాయం చేస్తున్న డిఇఓ పై చర్యలు తీసుకోవాలి

**– ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్**

**నరసరావుపేట** పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓకి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ మాట్లాడుతూ, పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష జి సి డి ఓ, ఏ ఎల్ ఎస్ సి ఓ పోస్టుల భర్తీపై డీఈవో పల్నాడు జిల్లాఅక్రమాల గురించి 2026 ఏప్రిల్ నెలలో పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో (సమగ్ర శిక్ష) ఖాళీగా ఉన్న జి సి డి ఓ మరియు ఏ ఎల్ ఎస్ సి ఓ పోస్టులు డిప్యూటేషన్ పై భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి ఉన్నారు అని అన్నారు. సదరు పోస్టులకు సంబంధించి మెరిట్ లిస్టులు మే 1 వ తారీఖున సిద్ధమైనప్పటికీ డిఇఓ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని అభ్యర్థులకు అదనపు మార్పులు కలపాలని దుర్బుద్ధితో మెరిట్ లిస్టులను కలెక్టర్ కార్యాలయానికి పంపకుండా ఆపేశారు అని అన్నారు. 10 రోజుల జాప్యం తరువాత డిఇఓ తను నిర్ణయించుకున్న అభ్యర్థులకు అర్హత లేకున్నా కమిటీపై ఒత్తిడి తెచ్చి అదనపు మార్కులు కలపడం జరిగినది అని అన్నారు. ( డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్) ట్రైనింగ్ ఇచ్చిన అభ్యర్థులకు మాత్రమే అదనపు మార్కులు కలపాలి అన్నారు. కానీ సదరు డిఇఓ తను ఎంచుకున్న అభ్యర్థులకు డిఆర్పి ట్రైనింగ్ ఇచ్చినట్టు సర్టిఫికెట్ లేకున్నా డిఆర్పి గా ట్రైనింగ్ తీసుకున్నారు అనే నెపంతో అదనపు మార్పులను కలిపి ఆ లిస్టులను తమ కార్యాలయానికి పంపారు అని అన్నారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ, కొంతమంది అభ్యర్థులు మెరిట్ లిస్టులో వెనకబడే ఉండడంతో మెరిట్ లిస్టులో మొదటి స్థానంలో ఉన్న అభ్యర్థులకు కాకుండా రెండవ స్థానంలో ఉన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కులు వేసి పోస్టులు భర్తీ చేయాలని దురాలోచనతో డీఈవో వ్యవహరిస్తున్నారు అని అన్నారు.15 మార్కుల ఇంటర్వ్యూలో కలెక్టర్ తో పాటు డీఈఓ, ఏపీసీ, డైట్ కాలేజీ ప్రిన్సిపల్ సభ్యులుగా ఉండాలి. అయితే డిఇఓ, ఏపీసీ, డైట్ కాలేజ్ ప్రిన్సిపల్ ఈ మూడు బాధ్యతలు డీఈవో నే నిర్వహిస్తున్నారు అని అన్నారు. కావున నిబంధనలను తుంగలో తొక్కిన డిఈఓపై చర్యలు తీసుకుని ఇంటర్వ్యూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగేటట్లుగా చూసి మెరిట్ను కాపాడవలసిందిగా పల్నాడు జిల్లా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ కమిటీ కోరుచున్నది అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ నాయకులు మస్తాన్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై

# వైసీపీ శాంతి ర్యాలీ

**– అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం**

**అరకులోయ** పెట్రోల్, డీజిల్ ధరలను వరుసగా పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అరకులోయలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీకి ఎమ్మెల్యే రేగం మత్యలింగం, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర నాయకత్వం వహించారు.ఎమ్మెల్యే రేగం మాట్లాడుతూ;కుటమి ప్రభుత్వం దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పార్టీలకతనీగా ప్రజల ఏకం కావాలని పిలుపునిచ్చారు.ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయని, యుద్ధ పరిస్థితులు ఇతర అంతర్జాతీయ కారణాలను చూపుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున పెంచిందని, అయితే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఐదు రూపాయల పెంచిందని వారు ఆరోపించారు.ఒక పెట్రోలా కాక నిత్యవసర ధరలు కూడా దారుణంగా పెరిగిపోయాయనీ, ఏపీ సుబద్ర ఆరోపించారు.దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో వైఎస్ఆర్సిపి ప్రజల పక్షంగా పోరాటాలు కొనసాగిస్తుందన్నారు .వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు.

## తెలంగాణలో పసుపు

# ఇక టీడీపీకి కాదు టీఆర్ఎస్‌ది

పార్టీ క్షేత్రస్థాయి బలానికి నిదర్శనంగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపేలా అధినేత్రి కవిత ఒక భారీ కార్యాచరణను ప్రకటించారు.

### ఒకే డిజైన్.. ఒకే బ్రాండ్

పార్టీ జెండా ఎగురవేసే ప్రతి చోటా ఒకే విధమైన ప్రమాణాలు ఉండాలని కవిత స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు నిర్మించే ప్రతి జెండా గద్దె ఒకే విధమైన కలర్ కోడింగ్, నిర్దేశిత డిజైన్ ను కలిగి ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ నలుమూలలా ఎక్కడ జెండా గద్దెను చూసినా అది తెలంగాణ రక్షణ సేనదే అని ప్రజలు గుర్తించేలా ఏకరూపతను పాటిస్తాం అని ఆమె పేర్కొన్నారు. ఈ వినూత్న బ్రాండింగ్ వ్యూహం ద్వారా పార్టీకి ఒక శక్తివంతమైన విజువల్ ఐడెంటిటీని తీసుకురావాలని నాయకత్వం భావిస్తోంది.

### నెల రోజుల పాటు జెండా పండుగ

సరికొత్త నిర్మాణ శైలిని మరియు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు మే 20వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగ నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ నెల రోజుల పాటు ప్రతి పల్లెలో, ప్రతి వార్డులో పండుగ వాతావరణంలో పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఈ పండుగ ద్వారా నిద్రాణంగా ఉన్న క్యాడర్‌ను యాక్టివ్ చేయడంతో పాటు, కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించడానికి ఈ వేదికను ఉపయోగించుకోనున్నారు.

### రాజకీయ క్షేత్రంలో పసుపు ప్రభంజనం

తెలంగాణ రాజకీయాల్లో పసుపు రంగుకు ఒక చారిత్రక ప్రాధాన్యత ఉంది. ఇప్పుడు అదే రంగును తమ పార్టీ జెండాగా మలచుకుని, తెలంగాణ రక్షణ సేన రేపటి రాజకీయ పోరుకు సిద్ధమవుతోంది. కేవలం జెండా ఆవిష్కరణకే పరిమితం కాకుండా, పార్టీ గద్దె వద్ద నిరంతరం ప్రజా సమస్యలపై చర్చలు జరిగేలా చూడాలని కవిత పిలుపునిచ్చారు. ఈ సరికొత్త వ్యూహం ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు తామే అసలైన వారసులమని చాటిచెప్పాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

### క్లిష్ట సమయాల్లో కేడర్‌కు భరోసా

తెలంగాణ రక్షణ సేన వేస్తున్న ఈ అడుగులు ఇతర ప్రధాన రాజకీయ పార్టీల్లో కూడా ఆసక్తిని రేపుతున్నాయి. జెండా పండుగ ముగిసే నాటికి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పార్టీ ఉనికిని చాటడమే కాకుండా, రాబోయే ఎన్నికలకు బలమైన పునాది వేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం. పసుపు రంగు జెండాతో తెలంగాణ నలుమూలలా ఒక బలమైన ముద్ర వేయాలని కవిత నేతృత్వంలోని టీఆర్ఎస్ నాయకత్వం కృతనిశ్చయంతో ఉంది.

## 40 వేల మందితో

# చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్

ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు 40 వేల మంది ఉద్యోగులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనగా, ప్రభుత్వ ప్రాధాన్యతలను, పనితీరును సీఎం వారికి వివరించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి ఉద్యోగులు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం కల్పించారు. కాకినాడ జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి గృహ నిర్మాణ పథకంపై కొన్ని విలువైన సూచనలు చేయగా, సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. "మీరు మంచి సూచన చేశారు, తప్పకుండా అమలు చేస్తాం" అని ఆ ఉద్యోగికి హామీ ఇచ్చారు. సీఎంతో మాట్లాడే అవకాశం లభించడంపై పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సంతృప్తికర సేవలు అందించడంలో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు జిల్లాల కలెక్టర్లు తొలి మూడు స్థానాల్లో నిలిచారని సీఎం అభినందించారు."విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నాం. అందరి సమష్టి కృషితోనే మనకు 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు దక్కింది. ప్రభుత్వ యంత్రాంగంలోని ప్రతీ ఒక్కరి సహకారంతో వ్యవస్థలు మెరుగుపడ్డాయి" అని చంద్రబాబు అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా పది సూత్రాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గడిచిన 23 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, తద్వారా 24 లక్షల ఉద్యోగాలకు అవకాశాలు వచ్చాయని వివరించారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, ఆమ్కా (ఏఎంసీఏ) వంటి కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, త్వరలోనే బీపీసీఎల్ వంటి మరో భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఆమ్కా ప్రాజెక్టుతో పుట్టపర్తి–బెంగళూరు మధ్య ఏరో స్పేస్ సిటీగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆర్థికేతర సమస్యలను 100 శాతం పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వ పాలనలో వేగం పెరగాలి. ఆమ్కా ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులు ఇచ్చి శంకుస్థాపన చేశాం. ఈ వేగం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పాలనలో ఎక్కడా అవినీతి కనిపించకూడదు, పూర్తి పారదర్శకతతో పనిచేయాలి. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగేలా మన పనితీరే బ్రాండ్‌గా మారాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, చిన్న సమస్య అయినా వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## కేబీఆర్ పార్క్ చెట్ల నరికివేతపై

# సుప్రీంకోర్టు స్టే

నిర్ణయించింది. ఇందులో భాగంగానే వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్డీపీ) కింద పనులు ప్రారంభించింది. అయితే, ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి, పార్కులోని జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు సోమవారం నాడు స్టే ఇచ్చింది.సుప్రీంకోర్టు తాజాగా విధించిన స్టేతో కేబీఆర్ పార్క్ జంక్షన్ పరిసరాల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఆర్‌డీపీ (ఎస్ఆర్డీపీ) ఫ్లైఓవర్ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన తదుపరి విచారణను సుప్రీంకోర్టు జులై 27వ తేదీకి వాయిదా వేసింది. నగరం మధ్యలో ఉన్న కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల చెట్లను కొట్టివేస్తున్నారని సామాజికవేత్తలు, పర్యావరణ ప్రేమికులు కొన్ని రోజుల నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతతో పర్యావరణానికి ప్రతికూల ప్రభావం ఉంటుందని, ఆక్సిజన్ కూడా తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో చెట్ల నరికివేతపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లు విచారించిన సుప్రీంకోర్టు తదుపరి విచారణ (జులై 27) వరకు చెట్లను టచ్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది.

## బండి భగీరథ్ పోక్సో కేసులో

# కీలక మలుపు

మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు, కేసు నమోదు విషయంలో పోలీసులు హైడ్రామా సృష్టించారని, బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకునే క్రమంలో పోలీసులు నిజం చెప్పకుండా ఒత్తిడి చేశారన్న విమర్శలు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ఈ కేసుకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది.వెంటనే రంగంలోకి దిగిన డీసీపీ రితిరాజ్, సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు ఫైళ్లను పరిశీలించారు. పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంలో స్పష్టత లేదని గుర్తించి, దర్యాప్తును లోతుగా చేపట్టారు. మంగళవారం డీసీపీ స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి, ఆమెతో స్నేహపూర్వక వాతావరణంలో మాట్లాడారు. పోక్సో కేసుల దర్యాప్తు నిబంధనల ప్రకారం, ఆమె నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. బాధితురాలు చెప్పిన విషయాలకు, పోలీసులు మొదట నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేదని గ్రహించారు. బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి జరిగిందని ఆమె వాంగ్మూలం ద్వారా తెలియడంతో ఇది అత్యంత తీవ్రమైన నేరమని డీసీపీ నిర్ధారించుకున్నారు. బాధితురాలి ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6 పరిధిలోకి వస్తాయని గుర్తించారు. దీనికి సమానమైన బీఎన్ఎస్ సెక్షన్ 64(2)(ఎం) ను కేసులో చేర్చాలని ఆదేశించారు. ఈ సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే నిందితుడికి కనిష్ఠంగా 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంటుంది. డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.

# తెలంగాణలో నూకల జగడం

**నల్గొండ** నూకల జగడం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. అటు రైతులకు, ఇటు రైస్ మిల్లర్లకు మధ్య ఇది తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేస్తున్నా, తాము దింపుకోలేమంటూ కుండబద్దలు కొట్టినట్టుగా రైస్ మిల్లర్లు చెబుతున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, రైస్ మిల్లర్లకు ఎదురయ్యే కష్టాలను తొలగిస్తూ..సాఫీగా ధాన్యం కొనుగోళ్లు జరిపేలా చూసి, కావాల్సిన బియ్యాన్ని సేకరించాల్సిన కేంద్ర ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పట్టించుకోకుండా, అసంబద్ధంగా రూపొందించిన నిబంధనల ఫలితమే.. ఈ నూకల జగడం. వాస్తవ పరిస్థితులను తెలిపినా, అటు కేంద్రం నుంచిగానీ.. ఇటు రాష్ట్రం నుంచిగానీ సానుకూల స్పందన రాకపోవడంతో చేసేదేమీ లేక రైస్ మిల్లర్లు సహాయనిరాకణకు దిగుతున్నారుఒక క్వింటాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎంతమేర బియ్యాన్ని ఇవ్వాలనేదానిపై రెండు రకాల పద్ధతులు ఉన్నాయి. ఇందులో పాత పద్ధతిలో అయితే.. ముడి బియ్యం (రా రైస్) విషయంలో 25 శాతం బ్రోకెన్ (నూక శాతం)తో కలుపుకుని 67 శాతం బియ్యం ఇవ్వాలని నిబంధన ఉంది.అంటే క్వింటాలు ధాన్యం మిల్లింగ్‌చేసి 67 కిలోల రా రైస్ ఇవ్వాలన్నమాట. ఇందులో 25 శాతం వరకు నూకలు ఉండవచ్చు. అదే బాయిల్డ్ రైస్ విషయంలో అయితే 15 శాతం నూకలతో 68 శాతం బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనల ప్రకారం కొంత ఇబ్బందికి అవకాశం ఉన్నా.. కిందామీద పడి రైస్ మిల్లర్లు నిబంధనల ప్రకారమే బియ్యం ఇస్తూ వస్తున్నారు. అయితే తాజాగా (రబీ)లో మరో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒప్పించారు. అందుకు అనుగుణంగానే సాధారణంగా ఉండే కోటాకు అదనంగా మరో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసి తీసుకునేందుకు కేంద్రం (ఎఫ్‌సీఐ) అంగీకరించారు. హమ్మయ్య అని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ.. అక్కడే అసలు తకరారు మొదలయ్యింది.అదనంగా తీసుకునే 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విషయంలో ఒక క్వింటాలు ధాన్యానికి ఇవ్వాల్సిన బియ్యం విషయంలో కేంద్రం పాత పద్ధతిని పక్కన పెట్టి కొత్త మార్గదర్శకాలను, నిబంధనలను రూపొందించి.. వాటి ప్రకారమే బియ్యం ఇవ్వాలంటూ హుకుం జారీచేసింది.దీనిని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లకు పురమాయించింది. రా రైస్ విషయంలో 10 శాతం నూకలతో.. 67 శాతం బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే బాయిల్డ్ రైస్ విషయంలో 5 శాతం నూకలతో 68 శాతం బియ్యాన్ని ఇవ్వాలని కేంద్రం నిబంధనలను రూపొందించింది.నిజానికి పాత పద్ధతిలో రారైస్ అయితే 25 శాతం బ్రోకెన్, బాయిల్డ్ రైస్ అయితే 15 శాతం బ్రోకెన్‌తో బియ్యం ఇవ్వడానికి రైస్ మిల్లర్లకు కాస్త ఇబ్బంది అయినా.. పాటిస్తూ వస్తున్నారు. అయితే అదనంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విషయంలో ఈ నిబంధనలను పూర్తిగా మార్చివేసి రా రైస్ అయితే 10 శాతం నూకతో.. బాయిల్డ్ రైస్ అయితే 5 శాతం నూకతో ఇవ్వాలని కేంద్రం విధించిన నిబంధనలను పేర్కొంటూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో రాష్ట్రంలోని రైస్ మిల్లర్ల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది.వాస్తవంగా ఉష్ణోగ్రతల ప్రభావాన్ని పరిగణలోకి తీసుకోకుండా సిద్ధంచేసిన నిబంధనలు పాటించడం ఈ రబీలో కష్టమని మిల్లర్లు తేల్చి చెబుతున్నారు. సాధారణంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు రా రైస్ అయితే 25 శాతం నూకతో 67 శాతం బియ్యాన్ని.. బాయిల్డ్ రైస్ అయితే 15 శాతం నూకతో 68 శాతం బియ్యాన్ని ఇవ్వవచ్చు. కానీ.. ప్రస్తుతం రాష్ట్రంలో 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి.ఈ వేసవిలో 46 డిగ్రీలకుపైగా కూడా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందికూడా. ఈ నేపథ్యంలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు ధాన్యం మిల్లింగ్ చేస్తే.. 25 శాతానికి మించి నూకలు వస్తాయని.. అప్పుడు 67 శాతం రైస్, 68 శాతం బాయిల్డ్ రైస్ రావు. మరి ప్రభుత్వానికి బియ్యాన్ని ఎలా ఇవ్వాలని మిల్లర్లు అడుగుతున్నారు. అందుకే తాము పీకల్లోతు నష్టాల్లో ముంచే అవకాశం ఉన్న ఈ నిబంధనల ప్రకారం బియ్యాన్ని ఇవ్వలేమని కరాకండిగా చెబుతూ.. జిల్లాల వారీగా, రాష్ట్ర స్థాయిలోనూ అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందిస్తున్నారు.ఇదిలా ఉండగా, కేంద్రం నుంచి వచ్చిన 10 శాతం నూకతో 67 శాతం రా రైస్ బియ్యం ఇవ్వాలనే నిబంధనను యధాతథంగా అమలుచేస్తూ, అదనంగా వచ్చే నూకలను అలాగే మిల్లర్ల వద్ద నిల్వ చేసుకోవాలని, కేంద్రం నుంచి (ఎఫ్‌సీఐ) వచ్చే తదుపరి ఉత్తర్వుల ప్రకారం ఆ నూకలను ఏం చేయాలనేది నిర్ణయిస్తామని పౌర సరఫరాల శాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఇక్కడే మిల్లర్లు మరోసారి తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా 25 శాతానికి మించి నూకలు వచ్చే నేపథ్యంలో.. 10 శాతం నూకలతో 67 శాతం రారైస్‌ను, అలాగే 5 శాతం నూకలతో 68 శాతం బాయిల్డ్ రైస్‌ను ఇవ్వడం ఎలా సాధ్యమంటూ మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. వాస్తవ వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. రా రైస్ అయితే 25 శాతానికిపైగా, బాయిల్డ్ రైస్ అయితే 15 శాతానికిపైగా నూకలతో ఇవ్వాలనే నిబంధనలు ఉండాలని..కానీ అందుకు విరుద్ధంగా 10 శాతం, 5 శాతం నూకలతో ఇవ్వాలని ఆదేశించడం.. పైగా అదే ఉత్తర్వుల్లో.. మిగిలిన15 శాతం నూకలను రైస్ మిల్లర్ల వద్దే నిల్వ చేయాలని చెప్పడంపై లబోదిబోమంటున్నారు. అంటే ఒకపక్క 25 శాతం నూకలు రావడం సహజమని ఒప్పుకుంటూనే.. 10 శాతం నూకలతో బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి ఇవ్వాలని చెప్పడంతో నోరెళ్ళబెడుతున్నారు.కేంద్రం రూపొందించిన నిబంధనలను ఒప్పుకుని బియ్యం ఇవ్వాలంటే (10 శాతం, 5 శాతం నూకలతో) అక్రమాలు చే యాల్సిందేనంటూ రైస్ మిల్లర్లు వాపోతున్నారు. నిబంధనల పేరుతో మిల్లర్లను అక్ర మాలు చేసుకునేలా మళ్ళిస్తున్నారా అం టూ మండిపడుతున్నారు. పైగా 25 శాతం నూకలు వస్తాయని చెబుతూనే, 10 శాతం నూకలతో ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయాలని.. మిగిలిన 15 శాతం నూకలను ఏం చేయాలనేది తరువాత నిర్ణయం తీసుకుంటాం.. అప్పటి వరకు మీరే భద్రప ర్చాలని చెప్పడంతో.. వాటిని సంరక్షించలేక.. ఇటు ఇవ్వాల్సినంత బియ్యాన్ని ఇవ్వ లేక.. అక్రమాలకు పాల్పడటమో.. లేక ఆస్తులను అమ్ముకోవడం తప్పితే గత్యంతరం లేదని మిల్లర్లు వాపోతున్నారు.ఈ నూకల కయ్యం కారణంగానే.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వేగంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ళకు అనుగుణంగా రవాణా వేగంగా సాగడం లేదు. ఈ నిబంధనల ప్రకారం తాము బియ్యం ఇవ్వలేమని, అందుకే తాము ధాన్యం తీసుకోమంటూ రైస్ మిల్లర్లు భీష్మించారు. బలవంతంగా లారీల్లో ధాన్యాన్ని పంపిస్తున్నప్పటికీ.. దింపుకోకుండా మిల్లర్లు వెనక్కి పంపించడమో.. లేక వెయిటింగ్‌లో పెట్టడమో చేస్తున్నట్టుగా సమాచారం రాష్ట్ర వ్యాప్తంగా లారీల కొరత, పేరుకు పోయిన ధాన్యం.. కొనుగోళ్లలో స్థంభన.. వెరసి రైతన్నలు రోడ్లపైకి వస్తున్నట్టుగా అధికారులుకూడా అంచనావేస్తున్నారు. మొత్తానికి కేంద్రం రూపొందించిన 'నూకల' శాతం కాస్తా.. ప్రభుత్వం, రైస్ మిల్లర్ల మధ్యన యుద్ధంగా మారడంతో.. ఆ ప్రభావం రాష్ట్ర రైతాంగానికి చుట్టుకుంది.అటు ప్రభుత్వం, ఇటు రైతులు.. మరోవంక రైస్ మిల్లర్ల మధ్యన ట్రయాంగిల్ వార్‌లా మారింది. దీనిపై ప్రభుత్వమే చొరవ తీసుకుని ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకుని నిబంధనలు మార్చితే.. ధాన్యాన్ని తీసుకోవడానికి సిద్ధమంటూ రైస్ మిల్లర్లు చెబుతున్నారు. మరి ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాలి..!

## ఆరోగ్యం ఫిట్నెస్‌పై అవగాహన కల్పించేందుకు 2కే రన్:

**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**రాజన్న సిరిసిల్ల** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23 వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2 కె రన్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. జెండా ఊపి 2 కే రన్ ప్రారంభించి అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు,చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్..అలైవ్ లో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించామని డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. చైల్డ్ సేఫ్టీ వీక్ కింద మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని, పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని, డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి,డీవైఎస్ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త తరహా మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– జిల్లా ఎస్పీ తుషార్ డూడి**



ఇటీవల దేశ వ్యాప్తంగా ఏ.టీ.ఎం.లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాల నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును సురక్షితంగా ఉంచుకునేందుకు బ్యాంకులు, ఏటీఎంలను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఇటీవల ఏ.టీ.ఎం. లను లక్ష్యంగా చేసుకుని నయా మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఒక ప్రకటనలో తెలిపారు.ముఖ్యంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతంలో వెలుగుచూసిన "క్యాష్ ట్రాప్" మోసాల తరహా ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ? మోసగాళ్లు ఏటీఎంలలో నగదు బయటకు వచ్చే స్లాట్ లోపల కనిపించకుండా ప్లాస్టిక్ ఫైబర్ లేదా ప్రత్యేక కార్డులను అమర్చి, ఖాతాదారులు డబ్బు డ్రా చేసిన తర్వాత నగదు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని, లావాదేవీ విజయవంతమైందని స్క్రీన్‌పై చూపించినప్పటికీ, డబ్బు చేతికి అందకపోవడంతో చాలామంది సాంకేతిక లోపమని భావించి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారని, ఆ తర్వాత ముఠా సభ్యులు వచ్చి స్లాట్‌లో ఇరుక్కుపోయిన నగదును దోచుకుంటున్నారని వివరించారు. గత కొన్ని రోజులుగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారని తెలిపారు. ప్రజలు ఏటీఎంలలో డబ్బు డ్రా చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## ఈ నెల 24 వరకు వార్డుల పునర్విభజన ముసాయిదాపై సలహాలు, సూచనల స్వీకరణ.



**తిరుపతి** కమిషనర్ (ఎఫ్.ఏ.సి)శారదా దేవి. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 24వ తేదీ జారీ చేసిన జీవో నెంబర్ 570, సిడిఎంఏ వారి ఉత్తర్వులు తేదీ.25-04-2026 ఆర్ఓసి నం.13032/2/2026/ఊ1-1 మేరకు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 50 ఎన్నికల వార్డులను 66 వార్డులుగా పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదిత ముసాయిదాను సోమవారం నుండి ప్రచురించినట్లు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డుల సరిహద్దులతో కూడిన ప్రతిపాదిత ముసాయిదాను అధికారికంగా ప్రచురించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ ముసాయిదాను రూపొందించినట్లు పేర్కొన్నారు. ముసాయిదాపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏవైనా ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంకు వ్రాతపూర్వకంగా సమర్పించాలని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) ఆ ప్రకటనలో కోరారు.

## మండల వివోఏలకు సెల్ ఫోన్లు పంపిణీ



**పిడుగురాళ్ల,** పిడుగురాళ్ల పట్టణంలోని మండల సమైక్య కార్యాలయం నందు సోమవారం ఉచిత ఆండ్రాయిడ్ 5జి మొబైల్ ఫోన్లను పిడుగురాళ్ల రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు గండికోట వెంకటేశ్వర్లు మంగళవారం వివోఏ లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరాపురం పి ఏ సి ఎస్ చైర్మన్ ఎడ్లపల్లి శివన్నారాయణ, జానపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముప్పాళ్ళ సాంబయ్య, మేకల రాంబాబు, శ్రీనివాస్ రెడ్డి పిడుగురాళ్ల ఎ.ఎం.సి డైరెక్టర్ పాదర్థి రాజేశ్వరి, పిడుగురాళ్ల రూరల్ మండలం తెలుగు మహిళా అధ్యక్షురాలు ఈదర అనురాధ, ముప్పాళ్ళ రమేష్, ఆంజనేయులు, మండల సమైక్య జ్యోతి, ఇంచార్జ్ ఏపిఎం, పలువురు సీసీలు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివోఏలు, ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని రా రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి

**– జిల్లా కలెక్టర్ కె.హైమావతి**




**సిద్దిపేట** జిల్లాలోని రా రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి వారి మిల్లులలో వరి ధాన్యాన్ని దించుకోవడంపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ఈసారి రబీ సీజన్లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వరిధాన్యం పండిందని వాటిలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఇప్పటికే 1లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని నేడు మరొక 20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని తెలిపారు. వాతావరణం అనుకూలించి అధికంగా ధాన్యం దిగుబడి వచ్చిందని అన్నారు.గ్రామాల వారీగా రైస్ మిల్లుల వారిగా ధాన్యాన్ని కేటాయిస్తామని జిల్లాలోని రా రైస్ మిల్లర్లు వారి మిల్లులో 40 శాతం కెపాసిటీతో మొత్తం 1లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్లో జిల్లాలో అధిక శాతం సన్న రకం వరి ధాన్యాన్ని రైతులతో పండించేందుకు ప్రభుత్వ ఆదేశాలు మేరకు రైతులను మోటివేట్ చేస్తున్నామని మిల్లర్లు కూడా రైతులకు సన్న రకం వరి ధాన్యాన్ని పండించడంపై చైతన్యం తీసుకురావాలని సూచించారు.


## కోటి 15 లక్షలతో కరాలపాడు గ్రామాభివృద్ధికి శ్రీకారం

**– కరాలపాడు టీడీపీ నాయకుడు షేక్ జానీ వెల్లడి**




**పిడుగురాళ్ల** పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల మండలం లోని కరాలపాడు గ్రామ అభివృద్ధికి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కరాలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ జానీ విలేకరులతో మాట్లాడుతూ, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, కూటమి ప్రభుత్వ పాలనలో గురజాల నియోజకవర్గం సరికొత్త ప్రగతి పథం వైపు అడుగులు వేస్తోంది అని జానీ అన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి యే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని షేక్ జానీ అన్నారు. ఇందులో భాగంగానే కరాలపాడు గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందనీజలో ఉంచేందుకు రూ. కోటి 15 లక్షల భారీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో మౌలిక వసతుల కల్పన, రోడ్ల నిర్మాణం, డ్రైనేజ్ మరియు ఇతర ప్రజా ఉపయోగకర పనులను వేగవంతం చేసి పూర్తి చేశారు అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందని స్థానిక నాయకులు, ప్రజలు అహర్షం వ్యక్తం చేస్తున్నారు. గురజాల ప్రగతి ప్రస్థానం యరపతినేని ఆధ్వర్యంలో ఇలాగే నిరంతరాయంగా కొనసాగుతుందని షేక్ జానీ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశానికి ఏర్పాట్లు



**సిద్ధిపేట** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం నిర్వహనకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఏర్పాట్లపై ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రజలను ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం పెంచేందుకు ఉద్దేశించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ఇప్పటికే గ్రామ మండల మరియు నియోజకవర్గ స్థాయి సమావేశాలను పూర్తి చేయడం జరిగిందని ఈనెల 22న జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించాలని ఈ సమావేశానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు తదితర ఏర్పాటు చేయాలని సమావేశం ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయాలని అదేవిధంగా ప్రజలకు వివరించేందుకు శాఖల వారీగా ఇందిరమ్మ ఇండ్లు,మాహాలక్ష్మి,గృహ జ్యోతి,రైతు బీమా,రైతు భరోసా,కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్న రకం వడ్లకు ప్రోత్సాహకం,ఆసరా పింఛన్లు తదితర పథకాల వివరాలను సిద్ధం చేయాలని, లబ్ధిదారులతో మాట్లాడించేందుకు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి..



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్ గ్రామంలో సోమవారం శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాలలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు. అనంతరం నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు జాతరలు ప్రతీకలని అన్నారు. నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో జాతర ఉత్సవాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జాతరను జరుపుకోవడం సంతోషకరమన్నారు. రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ జాతర కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పద్మ దేవేందర్ రెడ్డికి మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం. అంజగౌడ్, మాజీ ఎంపీపీ కిష్టయ్య,, గ్రామ పార్టీ అధ్యక్షుడు సత్య గౌడ్, గ్రామ ఉప సర్పంచ్ బండామీది దుర్గయ్య, మాజీ సర్పంచ్ గట్టయ్య, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ అశోక్, ముష్టి పెద్ద గంగయ్య,, రాజల్ పేట గట్టయ్య మంగలి ఆంజనేయులు, శాకానోళ్ల అంజయ్య,,శ్రీధర్ రెడ్డి,,మెదక్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎంబిపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో చేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిద ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 101 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజావాణిలో భూభారతి 52, ఇందిరమ్మ ఇల్లు ఎనిమిది పెన్షన్లు 9 ఇతర 32 దరఖాస్తుల స్వీకరించారు.ప్రజలు నుండి స్వీకరించిన సమస్యల దరఖాస్తులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పిసిఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డి ఆర్ డి ఏ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తికి ఘన సన్మానం



బోయినిపల్లి / కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్‌లో సోమవారం మున్నూరు కాపు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన బొమ్మ శ్రీరాం చక్రవర్తిని మున్నూరు కాపు సంఘం బోయినిపల్లి మండల ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, మున్నూరు కాపు వర్గ అభివృద్ధికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల మున్నూరు కాపు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## హత్య కేసులో 10 మందికి జీవిత ఖైదు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో 2020 లో నమోదైన హత్య కేసులో 10 మంది నిందితులకు సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.6,500 జరిమానా విధిస్తూ సోమవారం సంచలన తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్లగా,మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన తునికి మహేష్, బొంగాని కుటుంబానికి చెందిన యువతి ప్రేమ వ్యవహారం కారణంగా 10 మంది నిందితులు తునికి లక్ష్మీనారాయణ ఇంటిపై దాడి చేసి కట్టెలు, రాడ్లతో కొట్టడంతో ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.అప్పటి సీఐ నవీన్ కుమార్ చార్జిషీట్ దాఖలు చేయగా, అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు సిబ్బంది సమన్వయంతో 20 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ పెంట శ్రీనివాస్ వాదనలు వినిపించారు.శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువైందని తేల్చి 10 మందికి జీవిత ఖైదు విధించింది. నేరం చేసిన వారు శిక్ష తప్పించుకోలేరని, శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

## నూతన పోలీస్ స్టేషన్ను ప్రారంభించిన హోంమంత్రి అనిత జిల్లా ఇన్చార్జి మినిస్టర్ అనగాని సత్యప్రసాద్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) అత్యాధునిక వసతులతో పోలీస్ స్టేషన్ నిర్మాణం సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతంగా కేసుల పరిష్కారం భక్తుల భద్రత, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు శ్రీకాళహస్తి, ఈజ్ ఆఫ్ డూయింగ్ గవర్నన్స్ లో పేద ప్రజలకు పోలీస్ సేవలు మరింత సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎం ఎల్ ఏ బొజ్జల సుధీర్ రెడ్డి కలసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి మాట్లాడతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రజలకు జవాబుదారీతనం ఉండేలా రూ.2.75 కోట్ల వ్యయంతో శ్రీకాళహస్తి 2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రజలకు అందించే సేవల పై పోలీస్ శాఖ స్పష్టతతో పని చేస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్ లో భాగంగా పేద ప్రజలకు పోలీస్ సేవలు మరింత సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటిని పరిష్కరించే తీరును ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. బైక్ చోరీ జరిగినా, ఇతర కేసులు నమోదైనా వాటి పురోగతిని జిల్లా ఎస్పీతో పాటు హోం శాఖ ఒకే డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిశీలించే విధంగా సాంకేతికతను వినియోగిస్తున్నామని వెల్లడించారు.ఎస్ హెచ్ ఓ గది నుండి మహిళల కౌన్సెలింగ్ రూమ్ వరకు ప్రతి విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, ఆధునిక సౌకర్యాలతో కూడిన పోలీస్ స్టేషన్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి టి డి బోర్డు మెంబర్ పనబాక లక్ష్మీ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళల ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ప్రజాప్రతినిధులు, అడిషనల్ ఎస్పిలు రవి మనోహరచారి, శ్రీనివాస్ రావు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు

**జిల్లాలో మే 01 నుండి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 1861**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని మే 01 నుండి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నదని డిఎస్పీ నాగేంద్ర చారి తెలియజేశారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు నిర్వహించారాదని వెల్లడించారు.సిరిసిల్ల పట్టణ కేంద్రంలో పోలీసుల అనుమతులు లేకుండా ధర్నా చేసి పట్టణ కేంద్రంలో శాంతి భద్రతలకు, ప్రజా రవాణాకు విఘాతం కలిగించిన ఇరు వర్గాలపై సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసులు(క్రైం నంబర్ లు 270/2026, 271/2026) నమోదు చేయడం జరిగిందని డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య సమాచారాన్ని ప్రచారం చేసి జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లను కూడా బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని అన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను పరిశీలించిన ఆర్డీఓ కుమారి



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్నసిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులు అలాగే రైస్ మిల్లులను వేములవాడ ఆర్డీఓ కే.ఎస్.బి. కుమారి సోమవారం సందర్శించి పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం నిల్వలు, రైతులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, ఆర్ఐ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని పిడిచెడ్ గ్రామ శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో షేర్‌పల్లి గ్రామానికి చెందిన అత్తెల్లి ప్రవీణ్, ఆయన భార్య దుర్మరణం పాలయ్యారు. బైక్‌పై వెళ్తున్న వారిని ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటన ఎంతో బాధాకరమని పేర్కొంటూ, మృతుల పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అదేవిధంగా వాహనదారులు అతివేగంగా కాకుండా జాగ్రత్తగా, నిదానంగా వాహనాలు నడపాలని సూచించారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు తలెత్తుతుందని హెచ్చరించారు.భార్యాభర్తలు ఒకేసారి మృతి చెందడంతో షేర్‌పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, రఘుపతి రెడ్డి, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ జెండాపై దాడి అంటే తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా కేంద్రంలో నేతన్న చౌరస్తాలో బండి సంజయ్ ని కేంద్ర సహాయ మంత్రిగా బర్తరఫ్ చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ శ్రేణులపై బీజేపీ గుండాలు దాడులకు తెగబడటం ప్రజాస్వామ్యంపై చేసిన దాడి అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి ప్రజల మద్దతు లేక గుండాల మద్దతుతో రాజకీయాలు చేస్తోంది. బిఆర్ఎస్ కార్యకర్తలపై చేయి వేస్తే చేతులు విరిగేలా ప్రజలే తీర్పు చెబుతారు.కేసులు, దాడులు, బెదిరింపులు చూసి వెనక్కి తగ్గేది బిఆర్ఎస్ కాదు అన్నారు. ప్రజల కోసం పుట్టిన పార్టీ పోరాటమే మా ఊపిరి అంటూ తోట ఆగయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు ఇలాంటి పిరికి దాడులతో బిఆర్ఎస్ జోష్‌ను ఆపలేరని, ప్రతి కార్యకర్త కేసీఆర్ సైనికుడిలా ప్రజల కోసం చివరి వరకు పోరాడతాడని స్పష్టం చేశారు.గులాబీ జెండాపై దాడి అంటే తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసినట్టే అని అన్నారు.ప్రజల గుండెల్లో ఉన్న బిఆర్ఎస్‌ను ఎవరూ అణగదొక్కలేరని తోట ఆగయ్య హెచ్చరించారు.

## 10 మంది నిందుతులకు యావజ్జీవకారాగార (జీవిత ఖైదు) శిక్ష

**హత్య కేసులో సంచలన తీర్పు**

**నేరం చేస్తే శిక్షలు తప్పవు, శిక్షలతోనే సమాజంలో మార్పు**

**: ఎస్పీ మహేష్ బి. గితే**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) హత్య కేసులో 10 మంది నిందుతులకు యావజ్జీవకారాగార (జీవితఖైదు) శిక్ష, ఒక్కొక్కరికి 6500/- రూపాయల జరిమాన విధించినట్లు సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ కీలక తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు.కేసు వివరాల్లోకి వెళితే బోయినపల్లి మండలం స్థంబంపల్లి గ్రామానికి చెందిన తునికి లక్ష్మీనారాయణకి ఇద్దరు కుమారులు చిన్న కుమారుడు అయినటువంటి మహేష్ అదే గ్రామానికి చెందిన బొంగానీ పరిశరాములు కూతురు ఒకరికొకరు ప్రేమించుకున్నారు. ఇట్టి విషయం నచ్చని అమ్మాయి వాళ్ళ కుటుంబ సభ్యులు, బంధువులు (పది మంది) కలిసి అబ్బాయి వల్ల ఇంటి మీదకి గొడవకి పోయి అబ్బాయి కుటుంబ సభ్యులను కట్టెలతో రాడ్ లతో, చేతులతో కొట్టగా అబ్బాయి తండ్రి అయినటువంటి తునికి లక్ష్మీనారాయణకి బాగా గాయాలు అయ్యి చనిపోయాడు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ, న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.పై కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, పీపీలు పెంట శ్రీనివాస్, అప్పటి ,ప్రస్తుత సి.ఐ లు నవీన్ కుమార్, శ్రీనివాస్, సిఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, బోయినపల్లి ఎస్ ఐ రమాకాంత్,కోర్ట్ మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, కోర్టు కానిస్టేబుల్ సరేష్ , రాజేంద్ర ప్రసాద్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## గజ్వేల్ ప్రజావాణిలో డిబిఎఫ్ వినతులు

**- బెజగామ మాల కులస్తులకు అంబేడ్కర్ భవనం కేటాయించాలి**

**- దళిత మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)**గజ్వేల్ మండలంలోని బెజగామ గ్రామానికి చెందిన మాల కులస్తులకు అంబేద్కర్ భవనం కేటాయించాలని, కొమటిబండ గ్రామానికి చెందిన దళిత మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సోమవారం గజ్వేల్ ప్రజావాణిలో దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు మాట్లాడుతూ.. గతంలో బెజగామ మాల కులస్తులకు అంబేడ్కర్ భవనం కేటాయించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఎస్‌డిఎఫ్ నిధులు అందుబాటులోకి వచ్చిన వెంటనే భవనం మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్ల మరోసారి ప్రజావాణి ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లి భవనం మంజూరుకు సహకరించాలని అంబేద్కర్ సంఘం యువతతో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అలాగే కొమటిబండ గ్రామానికి చెందిన ఓ దళిత మహిళకు మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇల్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆమె నివాసం కూలిపోవడంతో గ్రామ కమ్యూనిటీ భవనంలో ఉంటోందని, కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ఆమెకు రెండో విడతలో అయినా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రజావాణి ద్వారా అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, కర్ణకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ట్రాఫిక్ కట్టుదిట్టం

**- ప్రమాదాల నివారణకు కీలక కూడళ్లలో బొల్లార్డ్స్ ఏర్పాటు**

**- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ డి సత్యనారాయణ**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** గజ్వేల్ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, రాంగ్ సైడ్ డ్రైవింగ్ మరియు రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈరోజు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ప్రమాదకర ప్రాంతాలు మరియు ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. ఈ బొల్లార్డ్స్ ద్వారా రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట పడటంతో పాటు వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించబడనున్నాయని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గజ్వేల్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ మాట్లాడుతూ "ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యం. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పట్టణంలో మరిన్ని కఠిన చర్యలు చేపడతాం. ప్రజలు కూడా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలి" అని తెలిపారు.

## ఇంటర్మీడియట్‌లో 996 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచిన ఎన్. జష్వితకు ఘన సన్మానం

**- బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ. కిరణ్ సాగర్ రావు**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 996 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచిన ఎన్. జష్వితను ఘనంగా సన్మానించారు. జష్విత, న్యాయవాది నర్రా శ్రీనివాస్ కుమార్తె కావడం విశేషం. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. కిరణ్ సాగర్ రావు, పిడిఎం కోర్టు సూపరింటెండెంట్ జ్యోతినాథ్ రెడ్డి మరియు పలువురు న్యాయవాదులు కలిసి జష్వితను అభినందించి శాలువాతో సత్కరించారు. తన కృషి, పట్టుదలతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన జష్విత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లక్ష్యసాధన కోసం కష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోటి న్యాయవాదులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి వర్యులు వంగలపూడి అనిత సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ వద్దకు చేరుకున్న హోంమంత్రి అనిత కి స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం హోం మంత్రి కుటుంబ సమేతంగా శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించి, స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను, శేషవస్త్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆలయ అధికారులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. సదరు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బి కే వెంకటేశులు, శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, డి. లక్ష్మమ్మ, గోపీనాథ్, ఆలయ ఏ ఈ ఓ విద్యాసాగర్ రెడ్డి ప్రోటోకాల్ ఏ ఈ ఓ మోహన్, ఏ పి ఆర్ ఓ రవి, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# చిత్తలూరులో ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





నల్గొండ (ప్రశ్న న్యూస్) ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర ఎంతో కీలకం. ఆట పాటలు, చిల్లర పనులు కష్టం సుఖం ఇలా ఏదైనా కాని అన్నింట్లో మన వెన్నంటే ఉండీ సపోర్ట్ చేసేది ఒక స్నేహితులు మాత్రమే. అందరి కన్నా మన జీవితంలో చెరగని ముద్ర వేసేది పదవ తరగతి వరకు చదువుకున్న దోస్తులు వారితో ఉన్న జ్ఞాపకాలు ఎన్నటికి మరచిపోనివి మరుపు రానివి పదో తరగతి తర్వాత దూరమైన అలాంటి స్నేహితులను మళ్లీ 34 ఏళ్ల తర్వాత అందరు ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలుసుకుంటే ఎంత ఆనందంగా ఉంటుందో మాటల్లో చెప్పలేము. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామా ప్రభుత్వ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు, ఆదివారం ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఒక్క చోట చేరిన పూర్వవిద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు, తాము ఈ స్థితిలో ఉండడానికి వాళ్లే కారణమని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేదికపై మాట్లాడిన ఉపాధ్యాయులు తమ విద్యార్థులను చూసి మురిసిపోయారు, ఇన్నేళ్ల తర్వాత తమని గుర్తించుకొని మరి ఆహ్వానించడం చాల సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు నాటి కబుర్లు చెప్పుకున్నారు. మరలా సెక్షన్‌ల వారీగా విడిపోయి క్లాస్రూంలోకి వెళ్లి విద్యార్థుల్లా మారారు. అప్పటి గురువుల బోధనల్ని గుర్తు చేసుకున్నారు.

ఎన్ని సంవత్సరాలు గడిచిన ఎన్ని పరిచయాలు అయిన చిన్ననాటి స్నేహితులదే ప్రత్యేక స్థానమని అన్నారు. ఈ సందర్భంగ కార్యక్రమం ప్రారంభంలో తమ మధ్య లేని ఉపాధ్యాయులు, మిత్రులని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్ననాటి జ్ఞాపకాలతో రోజంతా ఆనందంగా గడిపారు.

## శాస్త్రోక్తంగా శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం: టిటిడి

**- దివ్య సుగంధ జలాలతో ఆలయ శుద్ధి**

**- పవిత్ర పరిమళాలతో పుణ్యక్షేత్రం పరవశం**

తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అత్యంత వైభవంగా నిర్వహించారు. మే 23 నుండి 31వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు సంప్రదాయబద్ధంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం 7 నుండి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధితో పాటు శ్రీ పార్థసారథి స్వామివారి సన్నిధి, శ్రీఆండాళ్ అమ్మవారి ఆలయం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, శ్రీ పుండరీకవల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణాలను పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ





వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తి పరిమళాలతో నిండిపోయింది. తదనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస దీక్షితులు, ఆలయ ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, అర్చక బృందం పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియలో వేగం పెంచాలి

## ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**సెన్సస్ కోఆర్డినేటర్ లతో సమీక్ష సమావేశంలో ఎంఎంసి కమిషనర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలో నిర్వహిస్తున్న జనగణనలో వేగం పెంచాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు నాగోల్ పరిధిలోని జైపురి కాలనీని సందర్శించి, కొనసాగుతున్న జనగణన గణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పురోగతి తక్కువగా ఉండటంపై సమీక్ష నిర్వహించారు. పనితీరు సరిగా లేని ఎన్యూమరేటర్లను వెంటనే మార్చి, జనగణన ప్రక్రియను వేగవంతంగా మరియు సమర్థవంతంగా పూర్తి చేయాలని డీసీ, ఏఎంసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన హైడ్రేషన్ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. జనగణన ప్రక్రియను నిర్దేశిత గడువుల్లో నాణ్యతతో పూర్తి చేయాలని కమిషనర్ గారు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (డీసీ), డీవైఈఈ (సెన్సస్ కోఆర్డినేటర్), ఏఎంసీ, టీఐలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

జనగణన కార్యక్రమాన్ని మరింత సమన్వయంతో పనిచేయాలని తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సెన్సస్ కోఆర్డినేటర్ లను ఆదేశించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న జనగణన కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. కొంతమంది ఎన్యూమరేటర్ల పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ స్థాయిలో సూపర్వైజర్లు మరియు సిబ్బందితో సమన్వయం పెంచి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగుపరచాలని కోఆర్డినేటర్లకు సూచించారు. అలాగే, అందరూ ఎన్యూమరేటర్లు క్రమం తప్పకుండా ఫీల్డ్ విధులకు హాజరై, నిర్దేశిత విధానంలో సమర్థవంతంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. జనగణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## అహ్మాదీపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**- దంపతులు మృతి- గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం**



**గజ్వేల్(ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ గ్రామ సమీపంలో AP 28 BT 9258 నంబర్ గల టయోటా ఎటియోస్ కారు, ఖా 36 జ 2488 నంబర్ గల యూనికార్న్ మోటార్ సైకిల్ మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టయోటా ఎటియోస్ కారు డ్రైవర్ తోగుట నుండి గజ్వేల్ వైపు వెళుతూ వాహనాన్ని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి, గజ్వేల్ నుండి తోగుట వైపు వెళుతున్న యూనికార్న్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు తీవ్ర గాయాలు పొందగా, సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతులను షేర్‌పల్లి గ్రామానికి చెందిన అత్తేల్లి ప్రవీణ్ (57), తండ్రి రాజేశం, వైశ్య కులానికి చెందినవారిగా, అలాగే ఆయన భార్య అత్తేల్లి జ్యోతి (43)గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషాద ఘటనతో షేర్‌పల్లి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



## అప్పుడు ఇష్టం లేనిది.. ఇప్పుడు అలవాటైంది..



తొలినాళ్లలో కాస్తంత బొద్దుగా కనిపించిన కీర్తి సురేశ్, ఉన్నట్టుండి బాగా తగ్గింది. తను అనూహ్యంగా బరువు తగ్గి కనిపించడంతో ఆపరేషన్లు గట్రా చేయించుకుందంటూ ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడారు. సోషల్ మీడియాలో విమర్శలు కూడా ఎదురయ్యాయి. వీటిపై తాజాగా స్పందించింది కీర్తి సురేశ్.'ఇప్పటివరకూ నా ఫిట్‌నెస్ గురించి ఎవరితో మాట్లాడలేదు. మొదట్లో జిమ్ అనేది నాకు సంబంధించింది కాదు, నా శరీరానికి వ్యాయామం అవసరం లేదు అనే ధోరణిలో ఉండేదాన్ని. కానీ 'మహానటి' తర్వాత వచ్చిన గ్యాప్, నా గురించి నేను ఆలోచించుకునే అవకాశాన్నిచ్చింది. వర్కవుట్లు మొదలుపెట్టి కేవలం 9 నెలల్లో పది కేజీలు తగ్గాను. లావుగా ఉంటానంటూ నన్ను బాడీ షేమింగ్ చేసినవారందరికీ సరైన సమాధానం ఇచ్చాను. ఒకప్పుడు జిమ్ అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఇప్పుడు జిమ్ చేయకపోతే ఏదోలా ఉంటుంది. ఇది అలవాటుగా మారడం బావుంది. ఒకప్పుడు చీరలోనే అందంగా ఉండేదాన్ని. ఇప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ ప్రశంసలొస్తున్నాయ్' అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేశ్.

## రష్మిక టాటూ వెనుక
# ఆసక్తికర ఘటన!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న నటనతోనే, తన వ్యక్తిగత విషయాలతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఆమె కుడిచేతి మణికట్టుపై ఉన్న 'ఇర్రీప్లేసబుల్' అనే టాటూ గురించి సోషల్ మీడియాలో నిరంతరం రకరకాల పుకార్లు షికారు చేస్తూనే ఉన్నాయి. ఈ టాటూను ఆమె హీరో విజయ్ దేవరకొండ కోసమే ప్రత్యేకంగా వేయించుకుందంటూ నెటిజన్లు రకరకాల కథనాలను ప్రచారం చేస్తున్నారు. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన రష్మిక, ఈ టాటూ వెనుక ఉన్న అసలైన నిజాన్ని, దానికి దారితీసిన ఆసక్తికరమైన నేపథ్యాన్ని బయటపెట్టి ఆ పుకార్లకు పూర్తిగా చెక్ పెట్టారు. నిజానికి తనకు మొదట్లో శరీరంపై ఎలాంటి టాటూ వేయించుకోవాలనే ఆలోచనే లేదని రష్మిక స్పష్టం చేశారు. కానీ ఆమె కాలేజీ చదువుతున్న రోజుల్లో జరిగిన ఒక చిన్న సంఘటన ఆమె మనసును బలంగా తాకింది. ఒకరోజు కాలేజీలో ఒక అబ్బాయి రష్మిక దగ్గరకు వచ్చి, ఆడపిల్లలు అస్సలు నొప్పిని భరించలేరని... వారికి సూదులు, ఇంజెక్షన్లు అంటే చాలా భయమని కాస్త ఎగతాళిగా మాట్లాడాడు. ఆ మాటలను ఒక ఛాలెంజ్‌గా తీసుకున్న రష్మిక... ఆడవాళ్లు ఎంతటి నొప్పినైనా ఓర్చుకోగలరని నిరూపించడానికి, ఆ అబ్బాయి గర్వాన్ని అణచడానికే ఎలాగైనా టాటూ వేయించుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నారట. తీరా టాటూ వేయించుకోవాలని ఫిక్స్ అయిన తర్వాత, చేతిపై ఎలాంటి పదాన్ని రాయించుకోవాలా? అని చాలా సమయం ఆలోచించానని రష్మిక వెల్లడించింది. తన జీవితంలో ఎప్పుడూ చాలా సహజంగా, రియల్‌గా ఉండాలని కోరుకునే రష్మికకు ఒక బలమైన ఆలోచన వచ్చింది. ఈ ప్రపంచంలో ఏ ఒక్క మనిషిని మరొకరు ఎప్పటికీ భర్తీ చేయలేరని, ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో ప్రత్యేకమైనవారని ఆమె బలంగా నమ్ముతారు. ఆ విషయాన్ని ప్రతిరోజూ తనకు తాను గుర్తుచేసుకోవడానికి, అలాగే తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఒక మంచి లక్ష్యంగా ఉంచుకోవడానికి 'ఇర్రీప్లేసబుల్' అనే పదాన్ని టాటూగా ఎంచుకున్నట్లు రష్మిక క్లారిటీ ఇచ్చారు.

## 'ది రెడ్ బ్యాగ్' చిత్రంలో
# సావిత్రి పాత్రను పోషించిన రాశీ

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ సినిమా నుంచి స్పెషల్ రోల్ పోషిస్తున్న రాశీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.సావిత్రి పాత్రలో రాశీ 'ది రెడ్ బ్యాగ్' సినిమాలో ఓ పవర్ ఫుల్ రోల్‌ను పోషించారు. ఇక ఈ పాత్రకు సంబంధించిన గెటప్, లుక్స్ ఎంత సింపుల్‌గా ఉన్నాయో.. ఆమె లుక్ అంత ఇంటెన్స్‌గా ఉంది. ఈ చిత్రాన్ని మలుపు తిప్పే ఓ కీలక పాత్రలో రాశీ నటించారు. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీజర్‌ను రెడీ చేస్తున్నట్టుగా టీం తెలిపింది. ఇక టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ కానుంది. తొలి సినిమానే అయినా, నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి శేఖర్ మోపురి సంగీతమందించగా.. ప్రియేష్ గురుసామి కెమెరామెన్‌గా, శివ శర్వాని ఎడిటర్‌గా పని చేశారు. నటీనటులు : కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు



## సెయాన్‌మూవీ
# షూటింగ్ ప్రారంభం



వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్" ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న 'అమరన్' తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.ఈ రోజు నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని మేకర్స్ ఓ ఇంటెన్స్ పోస్టర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు. పోస్టర్‌లో శివకార్తికేయన్ రా అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న ఆగ్రహం క్యారెక్టర్ పవర్ ని చూపిస్తున్నాయి. ఈ పోస్టర్ సినిమా ఆధ్యాత్మికతతో పాటు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ను కూడా కలిగి ఉంటుందనే సంకేతాలు ఇస్తోంది.ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది.ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్‌గా సుప్రీమ్ సుందర్ పని చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అరుణ్ వెంకటరామూడి రూపొందిస్తున్నారు.ఇతర నటీనటుల వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. తారాగణం: శివకార్తికేయన్

## శ్రీలీల, తిలక్ వర్మ
# డేటింగ్ రూమర్స్.
### - ఫుల్ క్లారిటీ ఇచ్చిన హీరోయిన్ తల్లి



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల, టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె తల్లి స్వర్ణలత తెరదించారు. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆమె ఖరాఖండిగా తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కథనాల్లో అణువంత కూడా నిజం లేదని, ఇలాంటి పుకార్లు ఎలా పుట్టుకొస్తాయో అర్థం కావడం లేదని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఈ అంశంపై పూర్తి స్పష్టతనిస్తూ స్వర్ణలత మాట్లాడుతూ.. "ప్రస్తుతం శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు చదువులపైనా పూర్తి దృష్టి పెట్టింది. సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సమయం దొరికినప్పుడల్లా తన వైద్య విద్యపై ఏకాగ్రత చూపుతోంది. ముఖ్యంగా నీట్-పీజీ పరీక్ష కోసం సన్నద్ధమవుతోంది. ఆమె వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించే దశకు ఇంకా చాలా సమయం ఉంది.

బహుశా మరో ఐదు నుంచి ఆరు సంవత్సరాల తర్వాతే ఆ విషయాలపై దృష్టి పెడుతుంది" అని వివరించారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంఘటనల గురించి కూడా ఆమె ప్రస్తావించారు. 2025 డిసెంబర్‌లో తిరుమలలో శ్రీలీల, తిలక్ వర్మ కలిసి కనిపించడం, వాంఖడే స్టేడియంలో జరిగిన ఓ టీ20 మ్యాచ్‌కు శ్రీలీల హాజరుకావడం వంటివి కేవలం యాదృచ్ఛిక సంఘటనలేనని తెలిపారు. వాటి ఆధారంగా ఊహాగానాలు సృష్టించి సంబంధాన్ని అంటగట్టడం సరికాదని ఆమె హితవు పలికారు.గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి ప్రచారమే జరిగిందని స్వర్ణలత గుర్తుచేశారు.

బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల రిలేషన్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ.. "కార్తిక్ ఆర్యన్ తల్లి, నేను ఇద్దరం గైనకాలజిస్టులం. మా మధ్య ఉన్న వృత్తిపరమైన పరిచయాన్ని తప్పుగా అర్థం చేసుకుని అప్పట్లో ఇలాంటి కథనాలే సృష్టించారు" అని ఆమె పేర్కొన్నారు. సినీ తారల వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేకుండానే కథనాలు ప్రచారం చేయడం తగదని, అభిమానులు ఇలాంటి పుకార్లను నమ్మవద్దని ఆమె సూచించారు.

## కళానగర్‌లో మంచినీరు సమస్య
# పరిష్కరించండి:సిపిఐ

**- సోమవారం జీవీఎంసీ మధురవాడ జోనల్ కమిషనర్ కి సిపిఐ వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి**



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** జీవీఎంసీ 7 వ వార్డు కళానగర్ లో గత వారం రోజులుగా మంచినీరు సరఫరా ఆగిపోవడం వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కారం చెయ్యాలని, కొళాయిలు ద్వారా మంచినీరు సరఫరా ఉదయం 10 గంటలకు బదులుగా ఉదయం 6 గంటలకు సరఫరా చేసేటట్లు వేళల్లో మార్పులు చెయ్యాలని సిపిఐ మధురవాడ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం డి బేగం పలువురు గ్రామ ప్రజలు సోమవారం జీవీఎంసీ మధురవాడ జోనల్ కమిషనర్ గారిని ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశారు. జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు స్పందిస్తూ మంచినీటి సరఫరా వెంటనే పునరుద్దరన చేసి ఉదయం 6 గంటలకే కొళాయిలు ద్వారా నీరు సరఫరా చేసేటట్లు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## శ్రీశైల ఆలయంలో లోకకల్యాణార్థం
## పంచమఠాలలో పూజాదికాలు: ఈఓ



శ్రీశైలం (ప్రశ్న న్యూస్)లోక కల్యాణార్థం పంచమఠాలలో ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి.కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

# నెల్లూరులో హైటెక్ 'మిస్ట్ మిషన్

**- మల్టీ పర్పస్ కోసం కార్పొరేషన్‌కి మిస్ట్ మిషన్**
**- నగరాన్ని చల్లబరిచే సరికొత్త సాంకేతికత.**
**- మిస్ట్ మిషన్ పనితీరుపై మంత్రి నారాయణ సంతృప్తి**



**నెల్లూరు(ప్రశ్న న్యూస్)** నగరపాలక సంస్థ పరిధిలో పచ్చదనం తో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన 'మిస్ట్ మిషన్' రంగంలోకి దిగింది. నగరంలోని 14వ డివిజన్ ఏసీ నగర్ మల్లెల సంజీవయ్య ప్రాంగణంలో ఈ బహుళ ప్రయోజన మిషన్ పనితీరును రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మిస్ట్ మిషన్ ద్వారా రోడ్డు డివైడర్ల మధ్య ఉన్న మొక్కలపైకి అత్యంత వేగంగా నీటి తుంపర్లను విరజిమ్మి, వాటిపై పేరుకుపోయిన దుమ్ము, ధూళిని పూర్తిగా వదిలించవచ్చన్నారు. దీనివల్ల మొక్కలు పచ్చగా, కళకళలాడుతూ ఎదుగుతాయని తెలిపారు. కేవలం మొక్కలకు జీవజలాన్ని అందించడమే కాకుండా, నగర రోడ్లను శుభ్రం చేయడానికి, వేసవిలో గాలిలోని వేడిశాతాన్ని తగ్గించి చల్లబరచడానికి ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వీటన్నింటితో పాటు నగరంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, తక్షణమే నీటిని వెదజల్లి మంటలను అదుపు చేసే ప్రత్యేక అత్యవసర సౌకర్యం కూడా ఈ మిషన్‌లో ఉందన్నారు.నగరవ్యాప్తంగా ఇలాంటి అత్యాధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించబోతున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మేయర్ సుజాతా అశోక్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,అడిషనల్ కమీషనర్ హిమబిందు,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి,కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి,రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్,కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు,టీడీపీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# జలవనరుల శాఖపై సమీక్ష నిర్వహించిన: ముఖ్యమంత్రి చంద్రబాబు

**- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పనులు**
**- పోలవరం ఎడమ కాల్వ-చంపావతి లింక్ పై అధ్యయనం**
**- 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తి**
**- జలధార-జలహారతి పనులకు అధిక ప్రాధాన్యత**
**- సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీటి విడుదల**
**- ఇరిగేషన్ క్యాలెండర్ లో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యత**
**- జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం**



**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు.

ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25...సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

### నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం పనులు

సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

# ఖరీఫ్‌కు వ్యవసాయ శాఖ పూర్తి సన్నద్ధత

**- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా సమగ్ర కార్యాచరణ**
**- యూరియా సరఫరా, నిల్వలపై కఠిన పర్యవేక్షణ**
**- రైతులకు ప్రత్యేక యూరియా కార్డుల విధానం**
**- సుస్థిర వ్యవసాయం వైపు ప్రభుత్వం దృష్టి**
**- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఖరీఫ్-2026 సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జేడీలు, జిల్లా వ్యవసాయ అధికారులు (డి ఎ ఓ స్)తో నిర్వహించిన వర్చువల్ సమీక్షలో మంత్రి ఖరీఫ్ సన్నద్ధతపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, పంటల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూరియా సరఫరా విషయంలో ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాల వారీగా నిల్వలపై పకడ్బందీగా పర్యవేక్షణ ఉండాలని, అధికారుల వద్ద ఉన్న లెక్కలకు వాస్తవ నిల్వలకు పొంతన ఉండేలా చూడాలని ఆయన హెచ్చరించారు. ఎరువుల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత డీలర్లపై తక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేక కార్డుల విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్డు ద్వారా అవసరానికి అనుగుణంగా యూరియా పొందే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ముందస్తుగా యూరియా నిల్వలు చేయరాదని రైతులకు విజ్ఞప్తి చేశారు. యూరియా వినియోగంలో సమతుల్యత అవసరమని, మొదటి దశలో యూరియా వినియోగించి, తరువాతి దశల్లో నానో యూరియా ఉపయోగించాలని రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. నానో యూరియా వినియోగం ద్వారా అనేక మంది రైతులు మెరుగైన ఫలితాలు సాధించారని ఆయన గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. సచివాలయ సిబ్బంది ద్వారా ప్రచారం చేయాలని, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అవకాశం ఉన్న మేరకు ప్రత్యక్ష విత్తన సాగును (డైరెక్ట్ సోయింగ్) ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రైవేట్ షాపుల వద్ద యూరియా కోసం గందరగోళ పరిస్థితులు ఏర్పడకూడదని, రైతులకు అవసరమైన మేరకు సరఫరా సక్రమంగా జరగాలని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ పరిస్థితుల కారణంగా యూరియా దిగుమతుల్లో కొంత ఇబ్బంది వచ్చే అవకాశం ఉన్నందున, అవసరమైన పరిమాణాన్ని ముందుగానే కేంద్రంతో సమన్వయం చేసుకుని తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రైతులను సంప్రదాయ వ్యవసాయం నుంచి సుస్థిర, సహజ వ్యవసాయం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం



ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. నానో యూరియా, మిశ్రమ పంటలు, అంతర పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువులు, విత్తనాల సరఫరా, నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఖరీఫ్-2026ను విజయవంతంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు
## ఘనగా సత్కరించిన: ఎమ్మెల్యేకావ్య కృష్ణా రెడ్డి



కావలి (ప్రశ్న న్యూస్)గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే ,నెల్లూరు జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకటరాజు సోమవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నివాసానికి విచ్చేసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును ఘనంగా సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను మద్దిపాటి వెంకటరాజు కి పరిచయం చేశారు.ఇద్దరు నాయకులు నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## జైళ్ల శాఖలో ప్రక్షాళన చేస్తాం: హోం మంత్రి అనిత



తిరుపతి (ప్రశ్న న్యూస్)తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి, జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని, ఖైదీల సంఖ్య 120 ఉండాల్సింది 140 మంది ఉన్నట్లుగా తెలిసిందన్నారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని పెంచాలా, లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని తెలిపారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని.. ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# బీడు భూములు ఇక జలకళ

**- మరమ్మతులకు నోచుకోని కాల్వలకు జలధార**
**- చివరి వ్యవసాయ భూములకు సాగునీరు**
**- సంతోషంగా రైతులు**



బాపట్ల ( ప్రశ్న న్యూస్ )బీడు భూములు ఇకనుంచి సాగులోకి రానున్నాయి. పంట కాల్వల ద్వారా ఇప్పటివరకు చుక్క నీరు అందని పొలాలకు సమృద్ధిగా జలాధార తో నీరు చేరనుంది. నిరుపయోగంగా దర్శనమిస్తున్న ఫీడర్ కాల్వలు జలాధారతో జల కళను సంతరించుకోనుంది. పూడి పోయిన పంట కాల్వలు వినియోగంలోకి తీసుకురావడం జలధార లక్ష్యం. ఒట్టి పోయిన,పూడి పోయిన కాల్వలు, భూములలో జలధారలు ప్రవహించనున్నాయి. ఎంతోకాలంగా ఆశతో ఎదురు చూస్తున్న రైతుల ముఖలలో ఆనందం వెల్లి విరుస్తుంది. కాల్వల ద్వారా చివరి భూములకు నీరు అందించాలని విఫలయత్నం చేసిన రైతుల ఆశలు కార్యరూపం దాల్చాయి. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం వడివడిగా చర్యలు తీసుకుంటుంది. రైతులకు మేలు జరిగేలా రూపొందించిన ప్రణాళికలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు రానున్నాయి. రైతుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది.మండలం కోడూరు గ్రామం పరిధిలో సామాజిక ఫీడర్ కాల్వ మరమ్మతు పనులకు అన్నదాతలు శ్రీకారం చుట్టారు. ఎంతో కాలంగా సాగునీరు అందక రైతులు తమ పొలాలను బీడు పెట్టారు. మా భూములకు నీరు ఇవ్వండి అంటూ రైతులు చేసిన విన్నపాలు గత కొన్నేళ్లుగా బుట్టదాఖలయ్యాయి. జలధార జలహారతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడంతో సామాజిక ఫీడర్ కాల్వ మరమ్మతు చేయడానికి అవకాశం లభించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించారు. ఒక కిలోమీటర్ మేర కాల్వ మరమ్మతు పనులకు అన్నదాతలు శ్రీకారం చుట్టారు. తట్టా బుట్టా చేతబూని, గుణపాలు చెలకపారలతో పనులు ప్రారంభించారు.

# జిహెచ్ఎంసి పాలన అస్తవ్యస్తం

- అక్రమ నిర్మాణాలలో నెంబర్ వన్ స్థానానికి చేరుతున్న జిహెచ్ఎంసి
- సర్కిల్స్ పెంచారు కానీ సిబ్బంది,అధికారులు నియమించడం మరిచారు
- జిహెచ్ఎంసిలో రిటైర్మెంటేనా.. రిక్రూట్మెంట్ లేదా.?
- అరకొర సిబ్బంది, అధికారులతో నెట్టుకొస్తున్న వైనం
- ఒక్క అధికారికి 3 సర్కిల్ లు ఎక్కడ సక్రమంగా నిధులు నిర్వహించని వైనం
- సిబ్బంది,అధికారులు తక్కువ అంటూనే అవినీతిలో మాత్రం నెంబర్ వన్ స్థానమా.?

హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలన పూర్తిగా గాడితప్పిందనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నగరం విస్తరిస్తోందని చెప్పుకుంటూ కొత్త 150 సర్కిల్స్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం, వాటిని నడిపించేందుకు కావాల్సిన సిబ్బందిని, అధికారులను మాత్రం నియమించకపోవడంతో జిహెచ్ఎంసి వ్యవస్థ పాలన అంతా గందరగోళంగా మారింది. ఒక అధికారి మూడు మూడు సర్కిల్స్ బాధ్యతలు చూసే దుస్థితి నెలకొనగా, అక్రమ నిర్మాణాల మాఫియా మాత్రం ఈ బలహీనతను బంగారు గనిగా మార్చుకుంటోంది.

## ఏసీపీలు లేరు, సెక్షన్ ఆఫీసర్లు లేరు, చైన్‌మెన్లు కనిపించరు

జిహెచ్ఎంసి పరిధిలో అనుమతి లేని భవనాలు, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు, సెల్లార్ ఆక్రమణలు రోజురోజుకూ ఇష్ట రాజ్యాంగ పెరుగుతున్నా వాటిని అడ్డుకునే సిబ్బంది, అధికారులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పలు సర్కిల్స్‌లో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు (ఏసీబీ లు), సెక్షన్ ఆఫీసర్లు, చైన్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ పూర్తిగా కుంటుపడింది.

ప్రజల ఫిర్యాదులు పెరుగుతున్నా స్పందించేందుకు అధికారులు అందుబాటులో ఉండడం లేదు.

## ఫోన్‌లు ఎత్తరు, ఫీల్డ్‌కు రారు, నోటీసులు ఇవ్వరు

తక్కువ మంది అధికారులు సిబ్బంది ఉన్న లంచాలు సేకరించడంలో మాత్రం నంబర్ వన్ స్థానంలో ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చివరకు అక్రమ నిర్మాణాలు పూర్తయ్యాక "చూస్తాం" అంటూ కాలం గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నత అధికారులకు వాటాలు ఇవ్వడంతోనే ఈ తతంగం జరుగుతుందన్న గుసగుసలు ఉన్నాయి.

## ఒక్క అధికారి, మూడు సర్కిల్స్..

ప్రస్తుతం ఏర్పడిన మూడు కమిషనరేట్ల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో ఒకే అధికారి రెండు నుంచి మూడు సర్కిల్స్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అత్యంత దారుణమైన పరిస్థితి ఉంది.




ఉదయం ఒక ప్రాంతంలో తనిఖీలు చేస్తే, మధ్యాహ్నం మరో సర్కిల్‌లో సమావేశం, సాయంత్రం ఇంకో చోట ఫిర్యాదులు, దానికి తోడు ఉన్నతాధికారుల మీటింగులు ఇలా అధికారులపై పని భారం పెరిగిపోవడంతో అసలు పరిపాలన పూర్తిగా కుప్పకూలిపోయింది. దీంతో అక్రమ నిర్మాణాల దందా చేసే బిల్డర్లు, రియల్ ఎస్టేట్ మాఫియా, బ్రోకర్లు రెచ్చిపోతున్నాయి. అధికారులు రావడానికి ముందే భవనం పూర్తి చేయాలి అన్నట్టుగా రాత్రింబవళ్లు పనులు సాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో సెల్లార్లను కమర్షియల్ షాపులుగా మార్చడం, రోడ్లను ఆక్రమించడం, నాలా బఫర్ జోన్లలో నిర్మాణాలు చేయడం సామాన్యంగా మారిపోయింది.

## అక్రమ నిర్మాణాల్లో నంబర్ వన్‌గా గ్రేటర్ హైదరాబాద్

ఒకప్పుడు ప్రణాళికాబద్ధ నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్, ఇప్పుడు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర శివారు నుంచి కోర్ సిటీ వరకూ ఎక్కడ చూసినా అనుమతులకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా చాలా భవనాలు నిర్మాణం అవుతున్నాయి. అధికారుల కొరతను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు కోట్ల రూపాయలు సంపాదిస్తుండగా, ప్రభుత్వ ఆదాయానికి మాత్రం భారీగా గండి పడుతోంది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడం వల్ల పన్నులు, పెనాల్టీలు, రెగ్యులరైజేషన్ ఫీజులు సక్రమంగా వసూలు కావడం లేదు. మరోవైపు అక్రమ నిర్మాణాల వల్ల ట్రాఫిక్ సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులు, అగ్నిప్రమాదాల ముప్పు పెరుగుతోంది.

## ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమా.?

ప్రభుత్వ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుంది దానితో సిబ్బంది, అధికారులు పనిచేయక ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు ఇలా ప్రభుత్వ వైఫల్యంతోనే జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి. పదేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వ వైఖరిపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

కింది స్థాయి అధికారులు, సిబ్బంది లేక ఎలా పని చేయాలి.? అని ఉన్నతాధికారులే వాపోతున్న పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది లేకపోవడంతో అక్రమ నిర్మాణాల నియంత్రణ అసాధ్యంగా మారిందని ఉన్నత అధికారులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేసి, ప్రతి

# నాడు విప్లవాల గడ్డ..
# నేడు నాయకుల కుట్రలకు అడ్డా

- కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ బీజేపీ నేతలు, బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు
- పోలీసుల సమయస్ఫూర్తితో సద్దుమణిగిన వివాదం

**(దుర్గం విజయ్ బాబు- ప్రశ్న న్యూస్ బ్యూరో)**

సిరిసిల్ల ప్రాంతాన్ని "విప్లవాల గడ్డ" అని పిలుస్తారు. నిజాం పాలనకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటాలు (తెలంగాణ సాయుధ పోరటం), ప్రత్యేక రాష్ట్ర సాధన, జిల్లా సాధన కోసం జరిగిన ఉద్యమాలకు ఈ ప్రాంతం కేంద్ర బిందువుగా నిలిచింది. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తే మాత్రం మీసం మొలిచిన కొడుకులను చూసి ఆశలు ఎన్నో పెంచుకుంటే చదువుకొని సాత్తరని కలలు కంటే, రాజకీయ నాయకుల కుట్రలకు బలి అవుతున్న ఘటనలు అనేకం వెలుగుచూస్తున్నాయని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బిఆర్ఎస్, బీఆర్ఎస్, బీజేపీ నేతల ప్రెస్ మీట్లు, ఇరుపార్టీల నాయకుల వ్యవహారం పై హెచ్చరికలు చేసుకోవడం ఆందోళన కలిగించింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ ,బిజెపి పార్టీలు నిర్వహించిన నిరసన ర్యాలీలు, ధర్నాలతో తీవ్ర ఉద్రిక్తతకు పరిస్థితి నెలకొంది. బండి సంజయ్ కుమారుడి వ్యవహారానికి బాధ్యత వహించి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు భారీగా నేతన్న చౌక్ వద్ద కు చేరుకొని ప్లకార్డులతో





ఆందోళనకు దిగారు. రహదారి పై నిరసన కార్యక్రమం నిర్వహించారు. బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ నినాదాల చేశారు. అదే సమయంలో బిఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ బండి సంజయ్ నీ రాజకీయంగా దెబ్బతీయాలని కేటీఆర్ కుట్ర చేస్తున్నాడని ఆరోపిస్తూ బీజేపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా ధర్నాకు సిద్ధమయి అదే ప్రాంతానికి చేసుకున్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో పోలీస్ అధికారులు, ప్రత్యేక పోలీస్ బలగాలు బారీగా మోహరించి ఉన్నాయి. ఇరు పార్టీల

బీజేపీ శ్రేణుల పోటా పోటీ ధర్నాలు నిర్వహించాయి.నేతన్న చౌక్ కు చేరిన ఇరు పార్టీల ఆందోళన కారులు.కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ బీజేపీ నేతలు, బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులుపరస్పర ఆరోపణలు, దూషణలు చేస్తూ దాడులకు తెగబడే పరిస్థితి దాపరించింది.భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితి చేజారి పోతుండటంతో స్వయంగా రంగ ప్రవేశం చేసిన ఎస్పీ, డీఎస్పీ లు ఆందోళన కారులను చెదర గొట్టడానికి స్వల్ప లాటి ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటనతో రణరంగంగా సిరిసిల్ల నేతన్న చౌక్ ప్రాంతం అట్టుడికింది.

శ్రేణులు ఒక్క చోటుకు చేరుకోవడంతో ఆగ్రహావేశాలతో కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ బీజేపీ శ్రేణులు, బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ బిఆర్ఎస్ శ్రేణులు ఒకరిపై ఒకరు దగ్గరగా చేరుకొని బాహా బాహి కి దిగె పరిస్థితికి వచ్చారు. దీంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారుతుందని, పరిస్థితి చేజారి పోయే పరిస్థితిని గుర్తించిన పోలీసులు ఇరు వర్గాలను చెదర గొట్టే ప్రయత్నం చేశారు. నేతన్న చౌక్ లో బీజేపీ, బిఆర్ఎస్ శ్రేణులు దాడికి తెగ బడే పరిస్థితులు ఏర్పడనున్నాయన్న సమాచారంతో ఎస్ పి మహేష్ బి గీతే, డి ఎస్ పీ నాగేంద్ర చారి, ఎస్ బి డి ఎస్ పి వెంకటేశ్వర్లు స్వయంగా సంఘటన స్థలానికిత చేరుకొని ఆందోళన కారులను నిలువరించేందుకు తీవ్రంగా ప్రయత్నం చేశారు. ఒక దశలో ఆందోళల కారులపై పోలీసులు స్వల్పంగా లాఠీ ఛార్జ్ చేసి ఇరు వర్గాలను చెదర గొట్టారు.పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రత్యేక వాహనంలో పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఒక దశలో పోలీసుల దౌర్జన్యం నశించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా నేతలు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టీ ఒకరిపై ఒకరు తీవ్రమైన ఆరోపణలు చేసుకున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ఊరుకునేది లేదని ఇరుపార్టీల నేతలు హెచ్చరించుకున్నారు. బిఆర్ఎస్ శ్రేణులు జిల్లా తెలంగాణ భవన్ వద్ద బండి భగీరథ్, బండి సంజయ్ బారి ఫ్లెక్సీ తో రోడ్డుపై బైఠాయించి మరో సారి ధర్నా చేపట్టగా పోలీసులు ఫ్లెక్షిని తొలగించి ధర్నాను అడ్డుకున్నారు.పోలీసుల సమయ స్ఫూర్తి, సమయానికి చేపట్టిన రక్షణ, భద్రతా చర్యల మూలంగా ఉద్రిక్తత పరిస్థితిని నివారించారు.శాంతి భద్రతలకు విఘాతం కలుగ కుండా చర్యలు చేపట్టారు. పలువురి పై కేసులు కూడా నమోదు చేశారు పోలీసులు. రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఇప్పటికైనా తమ పంత మార్చుకొని విలువైన సమయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకొని కుటుంబాలకు అండగా ఉండి యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

# కాళేశ్వరం అంత్య పుష్కరాలకు 3,360 బస్సులు

- ఛార్జీలు పెంచుతున్నట్లు ఆర్టీసీ వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరంలో నిర్వహించనున్న అంత్య పుష్కరాలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 3,360 బస్సులతో 5,772 ప్రత్యేక ట్రిప్పులను నడపనున్నారు. ఈ మేరకు వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 1 వరకు గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమక్షేత్రమైన కాళేశ్వరంలో పుష్కరాలు జరుగుతున్నాయని, ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక రవాణా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 5,772 ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. రీజియన్‌లోని హన్మకొండ, వరంగల్ 1, వరంగల్ 2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ డిపోల నుంచి కాళేశ్వరానికి 59 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. హన్మకొండ బస్టాండ్ నుంచి మరిన్ని ప్రత్యేక బస్సులు ఉంటాయని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను పెంచుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనంగా వసూలు చేస్తామని అన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు యధావిధిగా ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని అన్నారు.

## 'అమ్మ' క్యాంటీన్లను ఆధునికీకరించాలని
# సీఎం విజయ్ ఆదేశాలు

- ప్రజలకు రుచికరమైన భోజనం అందేలా చూడాలన్న విజయ్



చెన్నై (ప్రశ్న న్యూస్) అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 'అమ్మ క్యాంటీన్ల'ను రాష్ట్రవ్యాప్తంగా ఆధునికీకరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సోమవారం ఆదేశించారు. క్యాంటీన్ల మౌలిక సదుపాయాలను, ఆహార పదార్థాల నాణ్యతను పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ క్యాంటీన్లలో ఆహార నాణ్యత, రుచి ఆశించిన స్థాయిలో ఉండటం లేదని ముఖ్యమంత్రి దృష్టికి వచ్చింది. దీంతో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాంటీన్ల వద్ద సౌకర్యాలు, సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. కొత్త వంట పాత్రలు, సామాగ్రి అందించాలని అన్నారు. ప్రజలకు రుచికరమైన భోజనం అందేలా చూడాలని సూచించారు. ఈ అమ్మ క్యాంటీన్లు జయలలిత హయాంలో ఏర్పాటయ్యాయి. మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలచే ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే జయలలిత పుట్టినరోజున, 2013 ఫిబ్రవరి 24న ఈ క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. మొదట చెన్నైలో ప్రారంభమైన ఈ క్యాంటీన్లను అనంతరం పట్టణాలు, నగరాలకు విస్తరించారు. 2021లో డీఎంకే అధికారంలోకి వచ్చాక మరో 200 క్యాంటీన్లను ప్రారంభించింది. ఇప్పుడు విజయ్ అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. గ్రేటర్ చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 383 అమ్మ క్యాంటీన్లు ఉండగా, స్థానిక సంస్థల పరిధిలో 237 క్యాంటీన్ల ద్వారా పేదలకు తక్కువ ధరకు భోజనం అందిస్తున్నారు. రూపాయికే ఇడ్లీ, రూ.3కు పొంగలి, రూ.5కి భోజనం అందిస్తున్నారు.

# మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం



**న్యూఢిల్లీ,** (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. ప్రపంచ నాయకు లకు స్వీడన్ అందించే అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' ఆయనకు లభించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీ అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ పురస్కారం ఒక నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. అంతర్జాతీయంగా భారత భాగస్వామ్యాలను, ప్రపంచ దేశాలతో సహకారాన్ని బలోపేతం చేయడానికి మోదీ నిరంతరం చేస్తున్న కృషిని ఈ అవార్డు ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు.విశేషమేమిటంటే, ఇది ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రస్థానంలో అందుకున్న 31వ అంతర్జాతీయ పురస్కారం అని చంద్రబాబు వెల్లడించారు. ప్రపంచ వేదికపై భారతదేశ ఖ్యాతిని పెంచడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588